



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 107 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 107 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 27 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!

- సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశం..
- కంటెంట్ క్రియేటర్లతో ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాలని సోషల్ మీడియాకు కేంద్ర మంత్రి సూచన
- జర్నలిస్టులు, మీడియా సంస్థలతో పాటు అందరికీ న్యాయమైన వాటా దక్కాలన్న అశ్విని వైష్ణవ్
- డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని వెల్లడి
- డీప్‌ఫేక్‌లు, ఏఐ కంటెంట్‌పై ఇప్పటికే నిబంధనలు కఠినతరం చేస్తున్న కేంద్రం

- మిగతా 2లో



## మరో ఎన్ కౌంటర్.. భద్రతాబలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

- ఆపరేషన్ కగార్ పేరుతో మావోలపై విరుచుకుపడుతున్న బలగాలు
- ఛత్తీస్ గఢ్ ఇంద్రావతి ప్రాంతంలో మరో ఎన్ కౌంటర్
- మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాల స్వాధీనం

పెన్ పవర్ డెస్క్:మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ ఆపరేషన్ లో వందలాది మంది మావోలు మృతి చెందారు.

- మిగతా 2లో

# కేటీఆర్, హరీశ్‌రావువి అన్నీ అబద్ధాలే

## కాళేశ్వరం వైఫల్యాలపై మంత్రి పొంగులేటి



- ప్రాజెక్టులపై కేటీఆర్, హరీశ్ వ్యాఖ్యలు వాస్తవ దూరమన్న పొంగులేటి
- లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శ
- రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్:గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు. ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.



## ఆకలినైనా భరిస్తాం.. కానీ అవమానాన్ని భరించం
### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ సమాజం ఆకలినైనా భరిస్తుంది కానీ అవమానాన్ని మాత్రం భరించదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమ న్యాయం కోసం ఈ ప్రాంతం కొట్లాడిందని.. ఈ పోరాటంలో వేలాది మంది నేలకొరిగారన్నారు. పోరాడి

- మిగతా 2లో

## ఈ ఏడాది నుంచే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ప్రారంభం




హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని ఆదేశించారు. గురువారం (ఫిబ్రవరి 26) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు, ఇంజనీర్లకు ముఖ్యమంత్రి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలి. వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలి. హైదరాబాద్ లోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలి. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదరాదు.ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.కృత్రిమ మేథ (AI) ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలి. మారుతున్న

- మిగతా 2లో

## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టిస్తాం

- వెలుగుమట్ల భూదాన్ భూ బాధితులను కలిసిన కేటీఆర్
- 60 ఎకరాల భూమిపై ముగ్గురు మంత్రుల కన్ను పడిందని ఆరోపణ
- పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చేశారని మండిపాటు

- మిగతా 2లో




## భారత్-ఇజ్రాయెల్ మధ్య కీలక ఒప్పందాలు... మైత్రి మరింత బలపడిందన్న మోదీ, నెతన్యాహు



భారత్, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు ప్రతి సవాల్‌ను తట్టుకుని కాలపరీక్షకు నిలిచాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ఈ బంధం ఎంతో బలమైనదని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని 'శాంతి, ఆవిష్కరణ, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం'స్థాయికి పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.జెరూసలేంలో గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ మాట్లాడారు. అంతకుముందు

- భారత్-ఇజ్రాయెల్ బంధం 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి
- ఏఐ, క్వాంటం టెక్నాలజీపై కొత్త ఒప్పందం.. ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలు
- సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సంఖ్యను 100కి పెంచాలని నిర్ణయం
- తమ బంధం ప్రతి సవాల్‌ను తట్టుకుని నిలిచిందన్న ప్రధాని మోదీ
- ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడతామని ఇరు దేశాల స్పష్టీకరణ


- మిగతా 2లో




## న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

- వివాదాస్పద పాఠ్యపుస్తకంపై తక్షణ నిషేధం
- న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోందంటూ సీజేఐ ఆగ్రహం
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కేంద్రం
- అవినీతి పాఠ్యాంశంపై కఠిన చర్యలు.. మార్చి 11న తదుపరి విచారణకు ఆదేశం

- మిగతా 2లో



## ఇతడే... నా భర్త విజయ్ దేవరకొండ

- ఒక్కటైన టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న
- తమ పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న రష్మిక
- విజయ్‌ను 'నా భర్త'గా పరిచయం చేస్తూ భావోద్వేగ పోస్ట్
- ఏళ్లుగా సాగుతున్న ప్రేమ ప్రచారానికి శుభం కార్డు
- విజయ్ వల్లే తాను కలలుగన్న మహిళగా మారానన్న నటి

- మిగతా 2లో



## ఏపీ శాసన మండలిలో తెలంగాణ నీళ్ల లొల్లి.. రాయలసీమ లిఫ్ట్ పై టీడీపీ వర్సెస్ వైసీపీ..

- తాము చెప్తే జగన్ ఆపారని హరీశ్ అసెంబ్లీలోనే చెప్పారన్న టీడీపీ
- రేవంత్ సర్కారుతో చంద్రబాబు లాలూచీ పడ్డారన్న వైసీపీ
- వైసీపీ హయాంలోనే ఆ ప్రాజెక్టును ఎన్జీటీ ఆపిందన్న పయ్యావుల కేశవ్
- రాయలసీమ ప్రాంతానికి నిజమైన ద్రోహి జగన్ అంటున్న టీడీపీ లీడర్లు
- పోలవరం, నల్లమల సాగర్ తో ఎవరికీ నష్టం లేదన్న సీఎం చంద్రబాబు
- తెలంగాణలో కాళేశ్వరం నిర్మిస్తే తాము అభ్యంతరం చెప్పలేదని వ్యాఖ్య

2లో

## పేదవాళ్ల ఇళ్లను కూలుస్తూ.. వేల కోట్లతో పార్కులా?



### రేవంత్ సర్కార్‌పై ఈటల ధ్వజం

- మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని ఈటల మండిపాటు
- పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, ఉన్న నీడను లాక్కుంటున్నారని విమర్శ
- ఈ పరిణామాలపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఏపీ శాసన మండలిలో తెలంగాణ నీళ్ల లొల్లి.. రాయలసీమ లిఫ్ట్ పై టీడీపీ వర్సెస్ వైసీపీ..

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తెలంగాణ నీళ్లపై వివాదం నెలకొంది. రాయలసీమ లిఫ్ట్ నిలుపుదలపై టీడీపీ, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగింది. ప్రాజెక్టును నిలుపుదల చేయించింది మీరంటే మీరని ఇరు పార్టీల నాయకులు విమర్శల కు దిగారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఆపిందని.. ఆ ప్రాంతానికి సీఎం చంద్రబాబు అన్యాయం చేశారని వైసీపీ సభ్యులు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంతో లాలూచీ పడి ప్రాజెక్టును నిలి పివేశారని వైసీపీ సభ్యులు ఇషాక్ బాషా, రామసుబ్బారెడ్డి ఆరోపించారు. దీనిపై టీడీపీ సైతం కౌంటర్ అటాక్ కు దిగింది. తాము చెప్తేనే జగన్ రాయల సీమ ప్రాజెక్టును ఆపేశారంటూ అసెంబ్లీలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్రావు తెలంగాణ అసెంబ్లీలోనే ప్రకటించారని మంత్రి నిమ్మల చెప్పారు. 2020లో ఎన్జీటీకి వెళ్లి రాయల సీమ ఎత్తిపోతలను తామే ఆపామని హరీ శిరావు తెలిపారని మంత్రి నిమ్మల అన్నారు. అప్పటి సీఎం జగన్ తెలంగాణ సీఎం కేసీఆర్ మాట్లాడటంతో ప్రాజెక్టు ఆగిందని హరీశ్రావు స్పష్టం చేసిన విషయాన్ని తెలు సుకోవాలన్నారు. రాయలసీమ ప్రాంతానికి నిజమైన ద్రోహి జగన్ అని.. ఆయన్ను నిలదీ యకుండా తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వైసీపీ హయాంలోనే సీమలోని ప్రాజెక్టులన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గు రయ్యాయని విమర్శించారు. ఆ ప్రాంతానికి నీరిచ్చేందుకు ఒక్క ప్రాజెక్టునూ జగన్ చేపట్టలేదని మండి పడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్పై తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి చేసిన ప్రకటనపై ఎక్కడా సమాధానం ఇవ్వలేదంటూ వైసీపీ సభ్యులు బొత్స సత్యనా రాయణ నిరసన తెలిపారు. దీంతో సభను మండలి చైర్మన్ కాసేపు వాయిదా వేశారు.

**పోలవరం-నల్లమల సాగర్ ఎవరికీ నష్టం లేదు..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం. నల్లమల సాగర్ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం. లేదని సీఎం చంద్రబాబు అన్నారు. ఇవాళ ఆయన ఏపీ అసెంబ్లీలో మాట్లాడారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీటినే తాము ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును గోదావరిపైనే కట్టారని, తాను ఏనాడూ అభ్యంతరం చెప్పలేదన్నారు. నల్లమల సాగర్ . తెలుగు రాష్ట్రాలకు లాభం తప్ప సష్టం లేనేలేదని అన్నారు. తాముకాళేశ్వరానికి అభ్యంతరం చెప్పలేదని... తెలంగాణ వాళ్లు కూడా నల్లమల సాగరు అభ్యంతరం చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని.. నీళ్లు ఉంటే అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని అన్నారు. టైమ్ బౌండ్ ప్రోగ్రామ్ పెట్టుకుని నదుల అనుసందానంపై ముందుకెళ్తామని సీఎం చంద్రబాబు అన్నారు.

### భారత్-ఇజ్రాయెల్ మధ్య కీలక ఒప్పందాలు... మైత్రి మరింత బలపడిందన్న మోదీ, నెతన్యాహు

- మొదటి పేజి తరువాయి

ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేసేందుకు 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పార్ట్నర్షిప్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్లో యూపీఐ సేవలను వినియోగించేందుకు ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో సహకారానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, దీన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. ఇజ్రాయెల్ సహకారంతో భారత్లో ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ విజయవంతం కావడంతో, వాటి సంఖ్యను 100కు పెంచనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి తుది రూపు ఇస్తామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై ఇరు దేశాల వైఖరి స్పష్టంగా ఉందని, దానికి ప్రపంచంలో చోటు లేదని మోదీ స్పష్టం చేశారు. గాజా శాంతి ప్రణాళిక ద్వారా శాంతికి మార్గం ఏర్పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇచ్చిందని పునరుద్ఘాటించారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇజ్రాయెల్ చారిత్రక గడ్డపై అడుగుపెట్టడం గర్వంగా, భావోద్వేగంగా ఉందని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ 'క్నెస్సెట్'లో ప్రసంగించే అవకాశం కల్పించినందుకు, స్పీకర్ మెడల్తో సత్కరించినందుకు నెతన్యాహుకు, ఇజ్రాయెల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**మోదీ పర్యటన చిన్నదే అయినా అద్భుతం: నెతన్యాహు ప్రశంసలు**

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన చిన్నదే అయినప్పటికీ, అది అసాధారణంగా ఫలవంతమైందని, హృదయాలను కదిలించిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. గురువారం జెరూసలేంలో ఇరు నేతల మధ్య చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"ఇది ఒక అద్భుతమైన పర్యటన. పర్యటన ముగింపు కూడా అంతే అద్భుతంగా ఉంది. నిన్న ఇజ్రాయెల్ పార్లమెంట్ 'నెస్సెట్'లో మోదీ చేసిన ప్రసంగం అందరి కళ్లను చెమర్చేలా చేసింది" అని నెతన్యాహు ప్రశంసించారు. ఇరు దేశాల్లోని ప్రతిభావంతుల మధ్య సహకారం గురించి చర్చించామని, వాటిని నిర్దిష్ట ప్రణాళికలుగా మారుస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా భారత్లో ప్రభుత్వ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని నెతన్యాహు కితాబిచ్చారు. "ఆవిష్కరణలను అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తు ఉంటుంది. భారత్, ఇజ్రాయెల్ గర్వించదగిన ప్రాచీన నాగరికతలు. భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి మేం నిశ్చయించుకున్నాం. కలిసికట్టుగా మరింత అభివృద్ధి సాధించగలం" అని అన్నారు. ప్రెసిషన్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరి సామర్థ్యాన్ని వెలికితీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం ఇజ్రాయెల్ చేరుకున్న ప్రధాని మోదీకి నెతన్యాహు దంపతులు ఘన స్వాగతం పలికారు. ఇజ్రాయెల్ పార్లమెంట్లో ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

### ఇతడే... నా భర్త విజయ్ దేవరకొండ

కొన్నేళ్లుగా సాగుతున్న ప్రేమ ప్రయాణానికి అధికారికంగా ముగింపు పలుకుతూ, సినీ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న శుభవార్తను నటి రష్మిక మందన్న స్వయంగా ప్రకటించారు. తన ప్రియుడు, స్టార్ హీరో విజయ్ దేవరకొండతో ఏడడుగులు నడిచానని, ఇకపై అతడే తన భర్త అని ప్రపంచానికి పరిచయం చేశారు. తమ సంప్రదాయ వివాహ వేడుకకు సంబంధించిన అందమైన ఫోటోలను ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకుంటూ, విజయ్పై తనకున్న ప్రేమను అక్షర రూపంలో ఆవిష్కరించారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్గా మారింది. "హాయ్ మై లవ్స్.. ఇప్పుడు మీకు నా భర్తను పరిచయం చేస్తున్నాను! మిస్టర్ విజయ్ దేవరకొండ!!" అంటూ రష్మిక తన సుదీర్ఘ పోస్ట్ను ప్రారంభించారు. "నిజమైన ప్రేమంటే ఎలా ఉంటుందో, మనతో మనం ప్రశాంతంగా ఉండటం ఎలాగో నాకు నేర్పించిన వ్యక్తి ఇతడే. పెద్ద కలలు కనడం సరైందేనని, నేను ఊహించిన దానికంటే ఎక్కువే సాధించగలనని ప్రతిరోజూ నాకు గుర్తుచేస్తూ, నిరంతరం ప్రోత్సహించిన వ్యక్తి" అని విజయ్ తన జీవితంలో పోషించిన పాత్రను వివరించారు. అతడి గురించి ఓ పుస్తకమే రాయొచ్చని చమత్కరించారు. ఓ మహిళగా నేను ఎలా ఎదగాలని అనుకున్నానో, ఆ విధంగా మారగలిగానంటే అందుకు విజయ్ నే కారణమని స్పష్టం చేశారు. "అందరిముందు డ్యాన్స్ చేయకుండా నన్ను ఎప్పుడూ ఆపలేదు. స్నేహితులతో కలిసి ప్రయాణం చేయడం ఎంత అద్భుతంగా ఉంటుందో చూపించాడు. నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే, దాని వెనుక ఉన్నది అతడే. నేను నిజంగా ఆశీర్వదించబడ్డాను" అని పేర్కొన్నారు. తన జీవితంలోని ప్రతీ ఘట్టానికి ఇప్పుడు ఓ అర్థం వచ్చిందని రష్మిక భావోద్వేగంతో తెలిపారు. "ఇప్పుడు నా విజయాలు, కష్టాలు, సంతోషం, బాధ, ఆనందం.. నా జీవితంలోని ప్రతిదీ మరింత అర్థవంతంగా మారింది. ఎందుకంటే వాటన్నింటికీ సాక్షిగా, అందులో అతిపెద్ద భాగంగా నువ్వు నా పక్కన ఉన్నావు" అని రాసుకొచ్చారు. విజయ్తో కొత్త జీవితాన్ని ప్రారంభించడంపై తన ఉత్సాహాన్ని దాచుకోలేకపోయారు. "నీ భార్యగా మారడానికి, నీ భార్య అని పిలిపించుకోవడానికి నేను చాలా చాలా చాలా ఎగ్జైటింగ్గా ఉన్నాను. ఇక ఫుల్ పార్టీ టైమే!! మనం కలిసి అత్యద్భుతమైన జీవితాన్ని గడుపుదాం! ఐ లవ్ యూ" అంటూ తన పోస్ట్ను ప్రేమగా ముగించారు. రష్మిక షేర్ చేసిన ఈ ఫెయిరీ టేల్ వెడ్డింగ్ ఫోటోలు చూసి అభిమానులు, సినీ ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# ఈ ఏడాది నుంచే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ప్రారంభం

- మొదటి పేజి తరువాయి

సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఏఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి. సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలి. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలి.

బ్రేక్ఫాస్ట్తో పాటు ప్రతి విద్యార్థికి పాలు అందజేయాలి. పాలను విజయా డెయిరీ నుంచి సేకరించాలి. విద్యార్థులకు ఎన్ని క్యాలరీలు అందజేస్తున్నామనేది తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి కిట్ అందజేయాలి. ఆ కిట్?లో స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండాలి. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్లో పొందుపర్చాలి. పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలి. కాలం చెల్లిన కోర్సులను తొలగించాలన్నారు. పాలిటెక్నిక్, ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలి. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయిస్తాం. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, మిగతా వర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలి. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ఫీజు రెగ్యులటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను ముఖ్యమంత్రి ముందుంచారు. వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలు, తెలంగాణలో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. వివరాలు తెలుసుకున్న అనంతరం జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఈవోల నేతృత్వంలో

పాఠశాలలను పరిశీలించి ఫీజుల నిర్ణయంపై నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ స్థాయిలోని కమిటీ తుది కమిటీగా ఉండి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే ఫీజు నియంత్రణకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను పబ్లిక్ డొమైన్లో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యా కమిషన్ సభ్యులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదవాళ్ల ఇళ్లను కూలుస్తూ.. వేల కోట్లతో పార్కులా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ ప్రభుత్వం బడుగు జీవుల ఉసురు పోసుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన, మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని, మధుపార్క్ వంటి అపార్ట్మెంట్లలో నివసించే వారి ఆవేదన ప్రభుత్వానికి వినిపించడం లేదా అని నిలదీశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, ఉన్న నీడను లాక్కోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలు, విద్యార్థుల డైట్ ఛార్జీలకు నిధులు లేవని చెబుతున్న సర్కారు... వేల కోట్లు వెచ్చించి గాంధీ పార్కు నిర్మించాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. "బడా బాబులు వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చూస్తూ ఊరుకుంటున్న పాలకులు, సామాన్యుడిపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నారు. కూకట్పల్లి ఎల్లమ్మబండ వద్ద 120 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనా పట్టించుకునే నాథుడే లేడు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ గాంధీ పార్కు కట్టాలనుకుంటే, కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన భూముల్లో నిర్మించుకోవాలి కానీ, పేదల ఇళ్లను పడగొట్టి కాదని అన్నారు. తెలంగాణలో జరుగుతున్న ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని, ఇక్కడి 'దుర్మార్గాలను' తక్షణమే అరికట్టాలని ఈటల డిమాండ్ చేశారు. పేదల పొట్టకొట్టి చేస్తున్న ఈ అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి తక్షణమే ప్రత్యామ్నాయం చూపాలని, లేనిపక్షంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టిస్తాం

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూ బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... శత్రుదేశంపై దండయాత్రకు వెళ్లినట్లు 4000 మంది పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చివేయడం ఇందిరమ్మ రాజ్యమా? అని నిలదీశారు. బాధితులకు అండగా ఉంటామని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదని ఆయన భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులే ఈ అక్రమాలకు సూత్రధారులని కేటీఆర్ ఆరోపించారు. సుమారు 60 ఎకరాల విలువైన భూదాన్ భూములపై మంత్రుల కన్ను పడిందని, వారి అక్రమ సంపాదన కోసమే పేదలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎలాంటి తప్పు చేయకపోతే ముగ్గురు మంత్రులు నేరుగా ఇక్కడికి వచ్చి బాధితులకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏ తప్పు జరగనప్పుడు ఆర్డీవోను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించిన ఆయన, ఒక అధికారిని బలిపశువు చేసి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించారు. పేదల ఉసురు తగిలి తీరుతుందని, అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న మంత్రుల వైఖరిని అసెంబ్లీలోనూ, కౌన్సిల్లోనూ ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. పట్టాలు సక్రమంగా ఉన్నా, కేవలం కాంగ్రెస్ నేతల వంకర బుద్ధితోనే ఈ దాడులు జరిగాయని ధ్వజమెత్తారు. "ఒకప్పుడు దేశంలో ఒరిజినల్ గాంధీలు ఉండేవారు, ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు తయారయ్యారు" అంటూ ఎద్దేవా చేశారు. పేదల ఇళ్లు కూల్చిన పాపం మంత్రులను విడిచిపెట్టదని అన్నారు.

# ఆకలినైనా భరిస్తాం.. కానీ అవమానాన్ని భరించం

- మొదటి పేజి తరువాయి

నేలకొరిగిన వీరుల స్ఫూర్తిగా ఉద్యోగులు బాధ్యలు చేపట్టాలన్నారు. గురువారం (ఫిబ్రవరి 26) హైదరాబాద్లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గ్రూప్--×, గ్రూప్--×× అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్?గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క గ్రూప్ 1 ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని తెలిపారు. ప్రశ్నాపత్రాలను జీరాక్స్ సెంటర్లలో అమ్మకుండా కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగాలు అమ్ముకున్నామని మా ప్రభుత్వంపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఎంపికపై కోర్టుకు కూడా వెళ్లారని.. కోర్టులో ప్రభుత్వం బలంగా వాదనలు వినిపించి అభ్యర్థుల పక్షాన నిలబడిందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ఎప్పటికీ తప్పు చేయదని చెప్పారు. ఇక, ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు చేరాలంటే ఉద్యోగులే కీలకమన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో మూడు రకాల పరిస్థితులు ఎదురవుతాయని.. ఒకటి గరం.. రెండు నరం.. మూడు భేషరమని చెప్పారు. మీరు మొదటి పరిస్థితి దగ్గరే ఆగిపోతే బాగుంటుదన్నారు. గరం, నరం, భేషరం అనే నానుడి తప్పు అని మీరు నిరూపించాలని సూచించారు. ఎలాంటి అప్రోచ్?తో ఉద్యోగంలో చేరారో రిటైర్మెంట్ అయ్యే

వరకు అలాగే ఉండాలన్నారు. మీరు ప్రదర్శించే చిత్తశుద్ధే ప్రభుత్వానికి మంచి పేరు అని అన్నారు. ఎంసీహెచ్ఆర్డీ, హార్వర్డ్ మధ్య ఒప్పందం జరగబోతుందని.. హార్వర్డ్?ను హైదరాబాద్ తీసుకొస్తున్నామని తెలిపారు. 43 రోజుల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్న అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. 4 కోట్ల మందికి సేవ చేసేందుకు మీరు సిద్ధమవుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజయమే లక్ష్యంగా, జీవితాశయంగా శ్రమించారు. లక్షలాది మందిలో ఎంపికయ్యారంటే మీరు మెరికల్లాంటి వాళ్లని ప్రశంసించారు.

# ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!

సోషల్ మీడియా ప్లాట్ఫామ్లు తమ ఆదాయాన్ని కంటెంట్ సృష్టించేవారితో న్యాయబద్ధంగా పంచుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు, సంప్రదాయ మీడియా సంస్థలు, ఇన్ఫ్లుయెన్సర్లు, విద్యావేత్తలు, పరిశోధకులు ఇలా ఎవరైనా సరే, కంటెంట్ సృష్టిస్తే వారికి ఆదాయంలో సరైన వాటా దక్కాల్సిందేనని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్లాట్ఫామ్లు ఇతరులు అప్లోడ్ చేసే కంటెంట్ ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతున్నాయని, అందుకే కంటెంట్ సృష్టికర్తలకు కూడా వారి సరైన వాటా దక్కాలని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని కంటెంట్ క్రియేటర్ల నుంచి మొదలుకొని, తమ పరిశోధనలను పంచుకునే ప్రొఫెసర్ల వరకు అందరికీ ఈ న్యాయం జరగాలన్నారు. ఆదాయ పంపిణీలో న్యాయబద్ధతను తీసుకురావడం ద్వారా దేశంలో డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. డిజిటల్ ప్లాట్ఫామ్ల జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తున్న తరుణంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ద

గతేడాది ఐటీ రూల్స్-2021కి కీలక సవరణలు ప్రతిపాదించింది. పెరిగిపోతున్న డీప్ఫేక్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించిన తప్పుడు సమాచారాన్ని అరికట్టడమే ఈ సవరణల లక్ష్యం. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం ఫేస్బుక్, యూట్యూబ్, స్నాప్చాట్ వంటి పెద్ద సోషల్ మీడియా సంస్థలు (50 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నవి) ఏఐ ఆధారిత కంటెంట్ను స్పష్టంగా లేబుల్ చేయాలి. వీడియోలు లేదా చిత్రాలైతే కనీసం 10 శాతం డిస్ప్లేను, ఆడియో అయితే మొదటి 10 శాతం వ్యవధిని ఈ లేబుల్ కవర్ చేయాలి. ఈ కంటెంట్కు శాశ్వత

మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్ జోడించాలని, దానిని మార్చడానికి లేదా తొలగించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ఏదైనా ప్లాట్ఫామ్ ఉద్దేశపూర్వకంగా లేబుల్ లేని ఏఐ కంటెంట్ను అనుమతిస్తే, అది ఐటీ చట్టం ప్రకారం 'తగిన శ్రద్ధ' పాటించడంలో విఫలమైనట్లు పరిగణించబడుతుంది.

### మరో ఎన్ కౌంటర్.. భద్రతాబలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

- మొదటి పేజి తరువాయి

వీరిలో అత్యంత కీలకమైన మావో లీడర్లు కూడా ఉన్నారు. ఇప్పటికే అనేక మంది మావోలు లొంగిపోయారు. పలువురు మావోలు లొంగిపోవడానికి సిద్దంగా ఉన్నారు. మరోవైపు, మావోలపై భద్రతాబలగాలు విరుచుకుపడుతూనే ఉన్నాయి. తాజాగా, ఛత్తీస్ గఢ్ బీజాపూర్ జిల్లా ఇంద్రావతి ప్రాంతంలో మరో ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోలు హతమయ్యారు. ఘటనా స్థలి నుంచి మృతదేహాలతో పాటు, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ... జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. పారిపోయిన మావోల కోసం కూంబింగ్ జరుగుతోందని వెల్లడించారు.

### మరో ఎన్ కౌంటర్.. భద్రతాబలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

- మొదటి పేజి తరువాయి

వీరిలో అత్యంత కీలకమైన మావో లీడర్లు కూడా ఉన్నారు. ఇప్పటికే అనేక మంది మావోలు లొంగిపోయారు. పలువురు మావోలు లొంగిపోవడానికి సిద్దంగా ఉన్నారు. మరోవైపు, మావోలపై భద్రతాబలగాలు విరుచుకుపడుతూనే ఉన్నాయి. తాజాగా, ఛత్తీస్ గఢ్ బీజాపూర్ జిల్లా ఇంద్రావతి ప్రాంతంలో మరో ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోలు హతమయ్యారు. ఘటనా స్థలి నుంచి మృతదేహాలతో పాటు, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ... జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. పారిపోయిన మావోల కోసం కూంబింగ్ జరుగుతోందని వెల్లడించారు.

### న్యాయవ్యవస్థపై ఎన్సీఈఆర్టీ 'కుట్ర'.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపేలా పాఠ్యపుస్తకాల్లో అభ్యంతరకర అంశాలను ప్రచురించిన ఎన్సీఈఆర్టీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతిపై చేర్చిన అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ పుస్తకంపై తక్షణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది కేవలం పొరపాటు కాదు న్యాయవ్యవస్థను కించపరిచేలా చేసిన ఉద్దేశపూర్వక కుట్ర అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**బుల్లెట్ తగిలి రక్తం చిందిస్తోంది: సీజేఐ**

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. "ఎన్సీఈఆర్టీ ప్రయోగించిన బుల్లెట్ తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అణచివేసేలా పాఠాలు రాయడం సరికాదు" అని మండిపడ్డారు. యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల అగౌరవం కలిగించేలా ఈ పాఠ్యాంశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులెవరో తేలేవరకు ఈ విషయాన్ని వదిలిపెట్టబోమని, జవాబుదారీతనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

**కేంద్రం బేషరుతు క్షమాపణ**

కోర్టు ఆగ్రహాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరుతుగా క్షమాపణలు కోరారు. ఈ పాఠ్యాంశాన్ని ప్రభుత్వం ఏమాత్రం సమర్థించడం లేదని, పబ్లిక్ నోటీసు ద్వారా క్షమాపణలు చెబుతామని వెల్లడించారు. ఇప్పటికే వివాదాస్పద పుస్తకాల పంపిణీని నిలిపివేసి, వెబ్సైట్ నుంచి కూడా ఆ పాఠాలను తొలగించామని కోర్టుకు వివరించారు.

**కఠిన చర్యలకు ఆదేశం**

ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్సీఈఆర్టీ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని

ఆదేశించింది. కాగా, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు ఈ వివాదాన్ని కోర్టు దృష్టికి తీసుకురావడంతో సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ కేసులో తదుపరి పరిణామాలు మార్చి 11న జరిగే విచారణలో వెల్లడికానున్నాయి.

# ‘పీఎం రహత్’లో చేరేందుకు సిద్ధం

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పొన్నం



హైదరాబాద్ పెన్ పవర్: రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం తీసుకొచ్చిన ‘పీఎం రహత్’ పథకంలో చేరేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్ని రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ఉన్నతాధికారులతో దిల్లీ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఇతర అధికారులు హైదరాబాద్ నుంచి పాల్గొన్నారు. గడ్కరీ మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా ప్రతి రోడ్డు ప్రమాద బాధితుడికి రూ.1.5 లక్షల వరకు చికిత్స ఉచితంగా అందుతుందన్నారు. సమావేశంలో పొన్నం

-4 లో

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

# 8.68 లక్షల భూభారతి దరఖాస్తులు ఏమయ్యాయి?



హైదరాబాద్ పెన్ పవర్: ‘రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.. భూభారతి పేరిట రెవెన్యూ సదస్సుల్లో ఇప్పటివరకు 8.68 లక్షల దరఖాస్తులు వచ్చినా.. పరిష్కారం కాలేదు’ అని శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడారు. పదినెలలైనా ఆ దరఖాస్తులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అసలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారా? ఎన్ని పరిష్కారమయ్యాయో కూడా ప్రభుత్వం వద్ద స్పష్టత లేదన్నారు. భారాస ప్రభుత్వ హయాంలో వ్యవసాయ భూములకు వారం రోజుల్లో పాసుపుస్తకాలు నేరుగా ఇంటికే పంపించామన్నారు. ఈ ప్రభుత్వం రుసుం వసూలు చేస్తోందే గానీ, ఒక్కరికి కూడా సరిగా అందించడంలేదని విమర్శించారు. 6,20,000 మంది పేదలకు సాదాబైనామాలు ఉచితంగా చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం భూములు విక్రయించిన వారు స్టాంప్‌పేపర్ మీద అఫిడవిట్ ఇవ్వాలన్న నిబంధన పెట్టడంతో రెండోదశలో 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. స్లాట్ రద్దయిన వారికి డబ్బులు కూడా తిరిగి ఇవ్వడం లేదన్నారు. 61 ఏళ్లు దాటిన వీఆర్ఏలను క్రమబద్ధీకరించడం లేదని, 4 వేల మందికి వారసత్వ ఉద్యోగాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నిషేధిత భూములు కోటి ఎకరాలు దాటాయని, వాటిని వెంటనే పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో హైకోర్టు హెచ్చరించినా

-4 లో

అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికిన వివిధ శాఖల అధికార యంత్రాంగం..



# మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా..

# ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్

## లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరణ..



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 26: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఫైజాన్ అహ్మద్ (ఐఎఎస్--2021) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఫైజాన్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.. ఇంతకు ముందు నిర్మల్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఫైజాన్ అహ్మద్‌ను బదిలీపై మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాకు నియమించారు. స్థానిక సంస్థల వ్యవహారాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ తదితర బాధ్యతలను ఆయన చేపట్టనున్నారు.. సమీకృత జిల్లా అధికారుల సముదాయంలోని వివిధ శాఖలకు చెందిన అధికార యంత్రాంగం ఆయనకు స్వాగతం పలికింది..



మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరికి మొక్కను అందజేస్తున్న నూతన అడిషనల్ కలెక్టర్..

# రిజర్వేషన్లు పెంచి దివ్యాంగులకు అండగా నిలిచిన కేంద్రం



హైదరాబాద్ పెన్ పవర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 3 నుంచి 4శాతానికి రిజర్వేషన్లు పెంచి దివ్యాంగులకు అండగా నిలిచిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో

-4 లో

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

‘ ఐదు రోజులకు ’

‘4 సెం.మీ 4 సెం.మీ’

‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’

93948 55244

షరతులు వర్తిస్తాయి

# తెలంగాణ హైకోర్టులో అక్రిడిటేషన్ కార్డుల విచారణ..!

## ”30 ఏప్రిల్ 2026” వరకు గడువు పొడిగింపు..

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌లో, జీవో నెంబర్ 252, సవరించిన జీవో 103తో జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరపున ప్రముఖ న్యాయవాది అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు.. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు.. ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది.. అలాగే, జీవో 252, సవరించిన జీఓ 103పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది.. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడగింపును స్వాగతిస్తూ, ఇది తాత్కాలిక ఊరట మాత్రమేనని, జర్నలిస్టులకు న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై దాఖలైన పిటిషన్‌కు సంబంధించి హైకోర్టు మధ్యంతర ఉపశమనం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులకు ఇది తాత్కాలిక ఊరటగా మారింది.. హైకోర్టులో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులపై విచారణతో, 30 ఏప్రిల్ 2026 వరకు హైకోర్టు గడువు పొడిగించింది.. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు సంబంధించిన జీవో నెంబర్ 252, జీవో నెంబర్ 103 సవరణలపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టియుడబ్ల్యుజెఎఫ్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది.. ఈ సందర్భంగా అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు పొడిగించనున్నట్లు ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది..

హైదరాబాదు, పెన్ పవర్, ఫిబ్రవరి 26:

- జీవో నెం. 252, సవరించిన జీవో 103పై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ..
- ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు..
- జర్నలిస్టుల కార్యకలాపాలకు ఆటంకం రాకుండా తాత్కాలిక ఉపశమనం..
- ప్రభుత్వానికి పూర్తి స్థాయి కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశం..
- నాలుగు వారాలకు విచారణ వాయిదా వేస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు..




# కేసీఆర్ నిర్ణయాల వల్లే తెలంగాణ అప్పులపాలు..

## కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకున్నరు



హైదరాబాద్ పెన్ పవర్: కేసీఆర్ నిర్ణయాల వల్లే తెలంగాణ అప్పుల పాలైందని.. కమీషన్ల కోసమే ఆయన ప్రాజెక్టులు కట్టారని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బీఆర్ఎస్ లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. రూ.లక్షా 75 వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం ఖర్చు చేశారని.. కానీ నాలుగేండ్లకే ఆ ప్రాజెక్ట్ కుప్పకూలిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల తెలంగాణ ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు.

-4 లో

-4 లో

# బాల్క సుమన్‌కు దక్కని ఊరట

## బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- క్యాతనపల్లి ఘటనలో జైలులో ఉన్న బాల్క సుమన్
- పెండింగ్ లో ఉన్న కస్టడీ పిటిషన్
- కస్టడీ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోనున్న కోర్టు



# బాల్క సుమన్‌కు దక్కని ఊరట: బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్ పెన్ పవర్:**చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు న్యాయస్థానంలో ఈరోజు కాస్త నిరాశ ఎదురయింది. క్యాతనపల్లి ఘటనలో అరెస్టై జైలులో ఉన్న ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల జిల్లా కోర్టులో ఈరోజు కూడా వాదనలు జరిగాయి. అయితే, పోలీసుల తరపున దాఖలైన కస్టడీ పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉండటంతో, బెయిల్ వ్యవహారంపై తదుపరి విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది. లంచ్ మోషన్ అనంతరం కస్టడీ పిటిషన్‌పై కోర్టు నిర్ణయం తీసుకోనుంది. బాల్క సుమన్ తరపున న్యాయవాది లలిత కోర్టులో గట్టి వాదనలు వినిపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు అక్రమ కేసులు బనాయించారని ఆమె ఆరోపించారు. సుమన్ అరెస్టు ప్రక్రియలో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలను పోలీసులు పూర్తిగా గాలికి వదిలేశారని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం అధికార బలంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, కావాలనే బీఆర్ఎస్ నేతలను జైలు పాలు చేసిందని ఆమె వివరించారు.మరోవైపు, కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని విచారించాల్సిన అవసరం ఉందని, అందుకే కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. క్యాతనపల్లి ఉదంతంలో బాల్క సుమన్ పాత్రపై మరింత లోతైన విచారణ జరపాల్సి ఉందని వారు వాదించారు. ఈ క్రమంలో బెయిల్ పిటిషన్ పై విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది.

# రిజర్వేషన్లు పెంచి దివ్యాంగులకు అండగా నిలిచిన కేంద్రం

-3 పేజి తరువాయి

మరుగుజ్జుల సంఘం రజతోత్సవ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. జనగామ జిల్లా చిన్నపెండ్యాలలో సర్పంచిగా గెలిచిన దివ్యాంగురాలు తిరుపతమ్మను ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి సత్కరించారు. వికలాంగులను దివ్యాంగులుగా పేరు మార్చి, వాళ్ల ఆత్మగౌరవాన్ని ప్రధాని మోదీ నిలబెట్టారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వికలాంగుల సంఘం ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, వికలాంగుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, బీసీ సంఘం నాయకుడు చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించిన నిధులను వారి కోసమే ఖర్చు చేయాలని కోరారు. మరుగుజ్జులకు ఇందిరమ్మ ఇళ్లు, సదరం కార్డులు, మోటర్ వాహనాల పంపిణీలో ప్రాధాన్యం ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు బుగ్గ మల్లేశ్ కోరారు. న్యాయవాది రాపోలు భాస్కర్, నేతలు మహమ్మద్ రహీం, ఎ.గణేశ్, ఎం.సైదులు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**తెలంగాణలో 3.30 లక్షల మందికి ఉచితంగా హెచ్‌పీవీ టీకా**

: సర్వైకల్ క్యాన్సర్(గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) ముప్పు నుంచి బాలికలను రక్షించేందుకు ఉచిత హెచ్‌పీవీ టీకా పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 28వ తేదీ నుంచి టీకా పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. 14 నుంచి 15 ఏళ్లలోపు బాలికలకు ఈ టీకాను అందించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో 3.30 లక్షల మందికి టీకా పంపిణీ కార్యక్రమం ఉంటుందని 'ఎక్స్' వేదికగా కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు.

# హైదరాబాద్‌లోనే ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు అన్ని రంగాల్లో సమాన లభించాలంటే చదువు ఒక్కటే మార్గామని ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్(వీఱఅఅర్‌వతీ ౘాంన్రేబతీఱ ఞఖఇఝఱ ఖబఝితీ) అన్నారు. దళితులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాను అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. గురువారం 59 దళిత కులాల సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్‌ను మరియు కాచిగూడ లోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్‌ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

**కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు..**

కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్‌ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సివిల్స్ కోచింగ్ కోసం తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. దళిత విద్యార్థులు ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కోచింగ్ తీసుకోవడం ఖర్చుతో కూడిన పని కావడంతో ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్‌లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ తీసుకోవడంతో పాటు మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు అడ్మిషన్‌లలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని మంత్రి తెలిపారు. సివిల్స్, గ్రూఫ్--1 గ్రూఫ్--2 కోచింగ్ కోసం మెరిట్ ఆధారంగా పారదర్శక ఎంపిక విధానం ఉంటుందని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఒక హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు.

**ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు..**

ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు రూపొందించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల ప్రతినిధిత్వం పెరిగే విధంగా ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్స్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని మంత్రి అన్నారు. తమిళనాడు మోడల్‌లా అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. పేద విద్యార్థి నుంచి ఒక మంచి అడ్మినిస్ట్రేటర్‌గా (పరిపాలకుడిగా) తీర్చిద్దిదాలనే అనే సంకల్పంతో మా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అలాగే మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నిర్ణయాల వల్లే తెలంగాణ అప్పులపాలు..

-3 పేజి తరువాయి

పదేండ్లలో బీఆర్ఎస్ పార్టీ ఆస్తులు, సొంత ఆస్తులు పెంచుకుందని అన్నారు. ప్రపంచంలోనే ధనిక రీజనల్ పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ చేసేందుకు కేసు సీబీఐకి అప్పగించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై సీబీఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కోసమే ప్రాణహిత చేవెళ్ల డిజైన్ మార్చారని అన్నారు.

## 'పీఎం రహత్'లో చేరేందుకు సిద్ధం

-3 పేజి తరువాయి

మాట్లాడుతూ.. పథకం అమలుకు జిల్లాలవారీగా అధికారుల నియామకం, కలెక్టర్లు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవడం వంటి ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసిందని వివరించారు.

**కాలుష్య కట్టడి... ప్రమాదాల నియంత్రణ**

తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూలేనివిధంగా అనేక సంస్కరణల్ని అమలు చేస్తోందని గడ్కరీకి రాష్ట్ర మంత్రి పొన్నం తెలిపారు. రహదారి ప్రమాదాల్ని తగ్గించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. సమావేశంలో జేటీసీలు చంద్రశేఖర్‌గౌడ్, శివలింగయ్య పాల్గొన్నారు.

# 99 డేస్ యాక్షన్ ప్లాన్‌కు కేబినెట్ సబ్ కమిటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో పాలన మరింత సమర్థంగా సాగేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ శాఖల్లో అమలు చేయాల్సిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక (99 డేస్ యాక్షన్ ప్లాన్) రూపొందించి అమలు చేయడానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేసి అమలు దిశగా అడుగులు వేయనుంది. ఈ సబ్ కమిటీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యులుగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

**త్వరలో కమిటీ సమావేశం**

ఈ కమిటీకి ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి ఆర్థిక శాఖతో పాటు సంబంధిత శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు కమిటీ సమావేశాలకు హాజరవుతారు. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజలకు ఇచ్చిన హామీలను కాలపరిమితిలో అమలు చేయడం లక్ష్యంగా ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అత్యంత ప్రాధాన్యతతో రూపొందించి, వేగంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే కమిటీ సమావేశమై అన్ని శాఖలతో సమీక్ష జరిపి వివరమైన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయనుంది.

# 8.68 లక్షల భూభారతి దరఖాస్తులు ఏమయ్యాయి?

-3 పేజి తరువాయి

కదలిక లేకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని హామీలిచ్చి ముక్కుపిండి రుసుం వసూలు చేస్తున్నారన్నారు. రెండున్నరేళ్లలో రెవెన్యూశాఖలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, మంత్రి కార్యాలయం నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు అందులో మునిగి తేలుతున్నారన్నారు. రెవెన్యూ మంత్రి కుమారుడే భూకబ్జాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో భూమిని కాపాడిన పోలీసులను బదిలీ చేశారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో అన్ని విషయాలు లేవనెత్తుతామన్నారు.

# ఒరిజినల్ గాంధీలు ఒకప్పుడు ఉండేవారు.. ఇప్పుడెవరూ లేరు: కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా భూదాన్ భూ బాధితులను కలిసి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇదే స్థలంలో మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మీకు ఇల్లు కట్టిస్తాం.. ఇది నా బాధ్యత అని భరోసా ఇచ్చారు. అక్రమ కూల్చివేతల గురించి శాసనసభ, శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమా? అని ప్రశ్నించారు. శత్రుదేశం మీద దండయాత్రకి పోయినట్లు 4000 మంది పోలీసులతో పేదల మీద దాడి చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పు చేయకపోతే ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావులను ఇక్కడికి రమ్మనండి అని సవాల్ చేశారు. ఏ తప్పు జరగక పోతే ఆర్డీవోను ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేశారు.. ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకడిని బలి పశువు చేసి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 60 ఎకరాలపై ముగ్గురు మంత్రుల కన్ను పడింది. నోటీసులు కూడా ఇవ్వకుండా పేదలను రోడ్డున పడేశారు. అక్రమ సంపాదన కోసం భూదాన్ భూములపై కన్నేశారు. ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులూ మాయగాళ్లే. ప్రజలు, అధికారుల మధ్య చిచ్చు పెడుతున్నారు. పట్టాలు సక్రమమే.. కాంగ్రెస్ నేతల బుద్ధే వంకర. దేశంలో ఒకప్పుడు ఒరిజినల్ గాంధీలు ఉండేవారు. ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు ఉన్నారు. కచ్చితంగా ఇళ్ల కూల్చివేత పాపం ముగ్గురు మంత్రులే. పేదల ఉసురు వారికి తప్పకుండా తగులుతుంది అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

**తుంగతుర్తి, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం సమీపంలో ఓ బైక్, సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బైక్‌పై ప్రయాణించిన వ్యక్తి రంగాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ధాన్యం అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడ్డ నిందితుల అరెస్టు:

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి రూ.43 కోట్ల వరకు నష్టం కలిగించిన ప్రధాన నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయగా మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. వీరి నుంచి రూ.1.09 లక్షల నగదు, మూడు చరవాణులు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

## సీనియర్ రేషన్ డీలర్ పరందాములు కుటుంబానికి ఆర్థిక సహాయం



**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 26 పెన్ పవర్:**కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామ సీనియర్ రేషన్ డీలర్ పరందాములు ఇటీవల మరణించారు. ఆయన కుటుంబానికి కామారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగం సురేందర్, ప్రధాన కార్యదర్శి సంతోష్ రావు, గౌరవాధ్యక్షులు లద్దూరి లక్ష్మీపతి యాదవ్, గౌరిశెట్టి రాజు, తాడ్వాయి మండల రేషన్ డీలర్ల సమక్షంలో రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని జిల్లా అధ్యక్షులు నాగం సురేందర్ చేతుల మీదుగా గురువారం అందజేశారు.

## కామారెడ్డిలో రోడ్డు ప్రమాదం

**కామారెడ్డి, ఫిబ్రవరి 26 పెన్ పవర్:**గురువారం బిక్కనూరు మండలం రామేశ్వరపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆయనను ఎదురుగా వచ్చిన వాహనం బలంగా ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108కు సమాచారం అందించారు. అనంతరం బాధితుడిని మెరుగైన చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 8వ వార్డు కౌన్సిలర్ ని సత్కరించిన మాజీ మున్సిపల్ చైర్మెన్

**బాన్సువాడ, ఫిబ్రవరి 26 పెన్ పవర్:**ఎల్లారెడ్డి పట్టణంలో 8వ వార్డ్ స్వతంత్ర కౌన్సిలర్ సిద్ది శ్రీధర్‌ను మాజీ మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి సామెల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు కో-కౌన్సిలర్ ఆధ్వర్యంలో మందు పిచికారి

**జుక్కల్, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** బాన్సువాడ మున్సిపాలిటీ 17వ వార్డులోని కోటగల్లి, దాళ్మలిక గుట్ట, బండగల్లి ప్రాంతాలలో కో–కౌన్సిలర్ అబ్దుల్ లాయక్ ఆధ్వర్యంలో గురువారం దోమల నివారణకు మందు పిచికారి చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు దోమల వల్ల అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికులు, వార్డు సిబ్బంది ఐజాజ్, షేరు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26(ఎ.ఎం.ఎస్):** హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంఎన్‌ఆర్ గార్డెన్ సమీపంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' క్యాంపెయిన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రామ్‌దాసు తేజావత్ ముఖ్య అతిథిగా పాల్గొని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయకూడదని, ద్విచక్ర వాహనదారులు, పిలియన్ రైడర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

**షాద్‌నగర్, ఫిబ్రవరి 26( పెన్ పవర్:** ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పునరుద్ఘాటించారు. ఆయన మండల పరిధిలోని అన్నారం గ్రామంలో పర్యటించి, గ్రామాభివృద్ధికి సంబంధించి పలు కీలక పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లావణ్య రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం లభించింది. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతి గదుల నిర్మాణానికి సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రఘు గౌడ్, ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

## జూబ్లీహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో మెట్రోస్టేషన్ సమీపంలో ఉన్న మంగళ గౌరి అనే బట్టల షాపులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు ఎగిసిపడుతుండటంతో ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం.

# రాజ్యసభ స్థానాలు ఖాళీ.. మల్లికార్జున ఖర్గేతో జగ్గారెడ్డి భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ఖాళీ కాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీ విషయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ) కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ అయిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. టీ కాంగ్రెస్?లో సీనియర్ నేతలు వి.హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్?కు రాజ్యసభ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని. జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్, స్టూడెంట్ లీడర్?తో పాటు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వాడైనందున అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. జెట్టి కుసుమ కుమార్ కుటుంబం ఫ్రీడమ్ ఫైటర్స్ ఫ్యామిలీ అని వారి కుటుంబం అంతా కాంగ్రెస్ లోనే ఉన్నారన్నారు హనుమంతరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేసిన అనుభవంతో పాటు మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారన్నారు. రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారని వయసులో పెద్ద వ్యక్తి, చురుకైన వ్యక్తి అయిన వీహెచ్?కు మరో సారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

**అధిష్టానం హామీ:**

తన ప్రతిపాదనపై కమిటీతో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని చెప్పారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ నిర్ణయం
మేరకు ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలోని రాజ్యసభ అవకాశంపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్?తో కూడా మాట్లాడినట్లు చెప్పారు. తాను రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చానని అయితే రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని జగ్గారెడ్డి చెప్పారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉపాధ్యాయుల నైపుణ్యాల మెరుగుదలకు

# స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** న్యాల్కల్ జెడ్పీహెచ్ఎస్‌లో మండల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్ గురువారం మాట్లాడుతూ ఈ సమావేశాలు ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థి కేంద్రిత బోధన, ఫలితాలు పెంచే పద్ధతులపై చర్చించారు. ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న నూతన పద్ధతులను తరగతి గదుల్లో అమలు చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వార్షిక విద్యా ప్రణాళిక, బోధనలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

## బిల్లులు రాలేదని బడి గేటుకు తాళం




**అచ్చంపేట, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలేదని ఆరోపిస్తూ గుత్తేదారు పాఠశాల గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరుబయటే కూర్చోవాల్సి వచ్చింది. కంచనపల్లి ప్రాథమిక పాఠశాలలో 2023లో మనఊరు- మనబడి పథకం కింద రూ.23 లక్షల వ్యయంతో ప్రహరీ, మరుగుదొడ్డి నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా రూ.4 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని గుత్తేదారు ఆంజనేయులు తెలిపారు. అధికారుల చుట్టూ తిరిగినా స్పందించడం లేదని తెలిపారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో గీతాంజలి, ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు అక్కడి వెళ్లి గుత్తేదారుతో మాట్లాడారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని నచ్చజెప్పి గేటు తాళం తీయించారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అప్పు చేయొద్దు

**నారాయణపేట, ఫిబ్రవరి 26పెన్ పవర్:**ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు లబ్ధిదారులు అప్పు చేసి తిప్పలు పడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఆయన మండలంలోని సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్వరాల గ్రామ పంచాయతీ వద్ద సమస్యలపై గ్రామస్థులతో చర్చించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించారు. విద్యుత్తు, రహదారుల సమస్యలపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. అనంతరం గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు దిన పత్రికలు చదివేలా అలవాటు చేయాలని సూచించారు. తెల్లవారుజామున నిద్ర లేపి చదివించడంతో పాటు ట్యూషన్‌కు వెళ్లేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు.

## కుదిపేస్తున్న కుమ్మెర ఘటన!

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26పెన్ పవర్:**కుమ్మెరలోని మల్లికార్జున స్వామి జాతరలో జరిగిన గొడవపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వివిధ రాజకీయ పార్టీలతో పాటు ప్రజాసంఘాలు బాధిత కుంబానికి అండగా నిలిచారు. బాధితులు చేపట్టిన దీక్షా శిబిరానికి పార్టీల నేతలు వచ్చి దాడిని ఖండిస్తున్నారు. వివిధ సంఘాల నేతలు ఘటనపై స్పందిస్తూ ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నిందితులను శిక్షించాలని డిమాండు చేస్తున్నారు. అధికారుల వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని బీసీ, ఎస్సీ కమిషన్ ఎండగట్టింది.

## జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడిగా రాజేష్ నియామకం

**గద్వాల, ఫిబ్రవరి 26పెన్ పవర్:**అంతర్జాతీయ మానవ హక్కులు మరియు సామాజిక న్యాయ సంస్థ (ఎఊఖీూఏూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు, జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీ రాజేష్ ని నియమించడం జరిగింది. సంస్థ ఆశయాలను గౌరవిస్తూ, జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు, సామాజిక సేవా కార్యక్రమాలకు రాజేష్ అంకితభావంతో కృషి చేస్తారని ఆశిస్తున్నారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుంది. .

## గణపవరం వద్ద కూలీల తో వెళుతున్న ఆటో బోల్తా

**సూర్యాపేట, ఫిబ్రవరి 26పెన్ పవర్:** కోదాడ మండలం గణపవరం ఆర్చి మలుపు వద్ద కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడింది. తొగరాయి గ్రామానికి చెందిన కూలీలు మేళ్లచెరువులోని మిరప తోటలకు కూలికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో ఉన్న కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, గాయపడిన వారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మంత్రి పదవులు భర్తీ ఇప్పట్లో లేనట్లేనా? హైకమాండ్ అదే చెప్పిందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఇప్పటికీ ఇంకా మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉండటంతో అందులో మూడింటిని అంతకు ముందు భర్తీ చేశారు. తర్వాత జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా మహ్మద్ అజారుద్దీన్ కేబినెట్ లో కి తీసుకున్నారు. మరో రెండు మంత్రి పదవులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. కానీ హైకమాండ్ మాత్రం మంత్రి వర్గంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి ఇప్పటి వరకూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఇటీవల పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన తర్వాత పార్టీ అగ్రనేతలతో రాష్ట్ర నేతలు భేటీ అయిన సందర్భంగా కూడా మంత్రి వర్గంలో ఖాళీగా ఉన్న పదవుల విషయంలో క్లారిటీ ఇవ్వలేదు.

**ఆశావహుల సంఖ్య...**

మరొకవైపు మంత్రిపదవులు కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. సామాజిక కోణంలోనూ, ప్రాంతాల వారీగా, జిల్లాల వారీగా తమకు అవకాశం లభిస్తుందని చాలా మంది భావించారు. కానీ ఊహించని వారికి పదవులు లభించడంతో ఇంకా పదవులపై మాత్రం ఆశలు వదులుకోవడం లేదు. మరొకవైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. తనకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పట్టుబడుతున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో కూడా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని తాము పిలిచి మాట్లాడతామని మాత్రమే చెప్పారు కానీ విస్తరణ విషయాన్ని మాత్రం తేల్చలేదు.

**రెడ్డి నేతల నుంచి పోటీ...**

ఎస్సీ మాల సామాజికవర్గం నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి, కరీంనగర్ జిల్లాకు చెందిన మాదిగ సామాజికవర్గానికి చెందిన




అడ్లూరి లక్ష్మణ్, బీసీ సామాజికవర్గానికి చెందిన వాకిటి శ్రీహరిలను మాత్రమే మంత్రిపదవులకు ఎంపిక చేసింది. అసంతృప్తులను ఆ సమయంలో ఇంటికి వెళ్లి బుజ్జగించి కొంత నచ్చ చెప్పే ప్రయత్నం చేసింది. పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లు సీనియర్ నేతలు సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనకు భరోసా ఇచ్చారు. ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కూడా తనకు మంత్రి పదవి కావాలని పట్టుబడుతున్నారు. అందరూ రెడ్డి సామాజికవర్గం నేతలు ఎక్కువగా పోటీ పడుతుండటంతో ప్రస్తుతానికి మంత్రి వర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్లేనని చెబుతున్నారు. అన్నీ సద్దుమణిగాక గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఛాన్స్ ఉందంటున్నారు. బహుశ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఉండొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# మధు పార్క్ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్‌లో ఉంది.. వివాదంపై కాంగ్రెస్ నేత కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మధు పార్క్ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్‌లో ఉందని కాంగ్రెస్ నేత, మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ సుందరీకరణ పనుల్లో భాగంగా నార్సింగి మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులు ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితికి వచ్చింది. దీనిపై అపార్ట్‌మెంట్ వాసులు ఇళ్లు ఖాళీ చేయకపోవడంతో వివాదంగా మారి చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై సామ రామ్మోహన్ రెడ్డి గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌పై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. గాంధీ ప్రాజెక్టుకి, మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కి సంబంధమే లేదని తేల్చి చెప్పారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్‌లో ఉందని, బఫర్ జోన్‌లో ఉంది కదా అని అపార్ట్‌మెంట్ వాసులపై మేము అధికారం చెలాయించట్లేదన్నారు. పైసా పైసా కూడబెట్టుకోని అపార్ట్మెంట్ కొనుకున్న ప్రజల బాధను అర్థం చేసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాళ్ళకి నష్ట పరిహారం చెల్లిస్తాం.. గవర్నమెంట్ వాల్యూ ప్రకారం అక్కడ స్క్వేర్ ఫీట్‌కు రూ. 3 వేల ధర ఉందని, ప్రభుత్వం రూ.5 వేలు ఇస్తామని చెప్పినట్లు స్పష్టం చేశారు.

**ముప్పై రూపాయలు కూడా తీసుకురాలే..**

కష్టపడి కొనుక్కున్న వాళ్ళకి నష్టం జరగవద్దని నష్టపరిహారం ఇస్తున్నామని ఆయన వెల్లడించారు. అపార్ట్‌మెంట్ వాళ్ళు మూసీ ప్రక్షాళనకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. నాడు బీఆర్ఎస్ నాయకులు మల్లన్న సాగర్ బాధితులను తరమడానికి ఊర్లోకి నీళ్లను వదిలారని ఆరోపించారు. మధు పార్క్ వెళ్ళిన హరీశ్‌రావు మల్లన్న సాగర్ ఎందుకు వెళ్ళలేదు? అని ప్రశ్నించారు. మూసీని మించి ప్రతిపక్ష నాయకులే అబద్ధాలతో ఈ రాష్ట్రాన్ని కలుషితం చేస్తున్నారని విమర్శించారు. పన్నెండు ఏళ్లలో మూసీ ప్రక్షాళనకు ముప్పై




రూపాయలు కూడా కిషన్ రెడ్డి తీసుకురాలేదని మండిపడ్డారు. రాజకీయాల కోసం ప్రతిపక్షాలు మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నాయన్నారు. హైదరాబాద్ ప్రజలను ముంచాలని బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌ను వరదల నుండి కాపాడడం మా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. బతుకిచ్చిన మూసీ నదిని బతికిద్దాం.. మురికి కూపంగా మారిన మూసీని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు కనిపించిన చెరువులన్నీ

కబ్జా చేశారని, సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళన చేయాలంటున్న బీజేపీ మూసీ ప్రక్షాళన అంటే ఎందుకు అడ్డు పడుతోందని నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల అబద్ధాల ప్రచారాలను తెలంగాణ ప్రజలు క్షమించరని అన్నారు.

# అక్రెడిటేషన్ కార్డుల అప్డేట్: హైకోర్టులో జర్నలిస్టులకు భారీ ఊరట

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు( విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌లో, జీఓ 252, సవరించిన జీఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు.




**న్యాయం సాధించే వరకు పోరాటం ఆగదు..**

ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే, జీఓ 252, సవరించిన జీఓ 103పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తిస్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రెడిటేషన్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడగింపును స్వాగతిస్తూ, ఇది తాత్కాలిక ఊరట మాత్రమేనని, జర్నలిస్టులకు న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# స్పెర్మ్ క్వాలిటీ పై ఆసక్తికర రిపోర్ట్: వేసవి అపోహలకే చెక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** పురుషుల ఫెర్టిలిటీపై మాట్లాడినప్పుడు, ఒక అభిప్రాయం వినిపిస్తుంది. ఎక్కువ వేడి, ముఖ్యంగా వేసవి ఉష్ణోగ్రతలు (వేసవి కాలం) స్పెర్మ్ క్వాలిటీని దెబ్బతీస్తాయని. అందుకే చాలా మంది జంటలు గర్భధారణ ప్రయత్నాలను కాలానుగుణంగా ప్లాన్ చేస్తుంటారు. తాజాగా వచ్చిన ఒక పెద్ద అధ్యయనం ఈ నమ్మకాలను పూర్తిగా తలకిందులు చేసింది. వాస్తవానికి, వేసవిలోనే స్పెర్మ్ నాణ్యత మెరుగ్గా ఉంటుందని ఈ రిపోర్ట్ వెల్లడించింది.

**15వేల కంటే ఎక్కువ మందిపై పరీక్షలు..**

ఈ అధ్యయనంలో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన 15,581 మంది పురుషుల వీర్య నమూనాలను విశ్లేషించారు. ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. సాధారణంగా అనుకున్నట్లుగా వేసవిలో స్పెర్మ్ క్వాలిటీ తగ్గలేదని, అందుకు విరుద్ధంగా జూన్, జులై నెలల్లో నాణ్యత ఎక్కువగా ఉందని తేలింది. అదే సమయంలో డిసెంబర్, జనవరి వంటి చల్లని కాలంలో స్పెర్మ్ క్వాలిటీ తక్కువగా నమోదైంది.

**డీ విటమిన్ కారణమా?**

ఈ ఫలితాలపై పరిశోధకులు విశ్లేషించినప్పుడు మరి కొన్ని ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. వేసవిలో ఎక్కువ సూర్యకాంతి వల్ల శరీరంలో విటమిన్ 'డీ' స్థాయిలు పెరుగుతాయి. ఇది హార్మోన్ల సమతుల్యతకు సహాయపడుతుంది. అలాగే, వేడి కారణంగా రక్తప్రసరణ మెరుగుపడడం కూడా స్పెర్మ్ ఉత్పత్తిపై పాజిటివ్ ప్రభావం చూపవచ్చు. మరోవైపు శీతాకాలంలో శరీర కార్యకలాపాలు తగ్గడం, సూర్యకాంతి కొరత ఉండటం వల్ల హార్మోన్ల మార్పులు సంభవించి స్పెర్మ్ నాణ్యత తగ్గే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**గత అనుమానాలకు లైన్ క్లియర్..**

ఇది వరకూ ఉన్న 'వేసవి = స్పెర్మ్ డ్యామేజ్' అనే భావనకు ఈ అధ్యయనం సమాధానం ఇచ్చింది. అయితే, దీన్ని పూర్తిగా సాధారణ నియమంగా తీసుకోవడం కూడా సరైంది కాదు. ఎందుకంటే వ్యక్తిగత జీవనశైలి, ఆహారం, ఆరోగ్య పరిస్థితులు, ఒత్తిడి వంటి అంశాలు కూడా ఫెర్టిలిటీపై ప్రభావం చూపుతాయి. కేవలం కాలం మార్పుతోనే ఫలితాలు మారిపోవు.

**గర్భాదారణకు యత్నిస్తున్న జంటలకు గుడ్ న్యూస్..**

ఈ రిపోర్ట్ ముఖ్యంగా గర్భధారణ కోసం ప్రయత్నిస్తున్న జంటలకు ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణంగా చాలామంది 'ఏ కాలంలో ప్రయత్నిస్తే మంచిది?' అనే సందేహంతో ఉంటారు. ఇప్పుడు ఈ అధ్యయనం ప్రకారం వేసవి కాలం కూడా మంచి అవకాశాలను అందిస్తుందని చెప్పవచ్చు. అలాగే ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న వారికి కూడా ఇది ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. వైద్యులు చికిత్సా ప్రణాళికలు రూపొందించేటప్పుడు సీజనల్ ఫ్యాక్టర్లను పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది.

**దీనితో పాటు వీటిని కూడా చూసుకోవాలి..**

అయితే ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి.. ఫెర్టిలిటీ అనేది ఒకే ఒక్క కారణంపై ఆధారపడే విషయం కాదు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటి అంశాలు కూడా కీలకం. అధిక మద్యం, పొగతాగడం వంటి అలవాట్లు స్పెర్మ్ క్వాలిటీని దెబ్బతీస్తాయి. కాబట్టి జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా కూడా ఫెర్టిలిటీని మెరుగుపరచుకోవచ్చు.మొత్తానికి, ఈ తాజా అధ్యయనం ఒక విషయం స్పష్టంగా చెబుతోంది మనం అనుకున్నట్టుగా ప్రకృతి ఎప్పుడూ ఒకే విధంగా పనిచేయదు. కొన్ని సార్లు మన నమ్మకాలకే విరుద్ధంగా ఫలితాలు వస్తాయి. వేసవి కాలాన్ని ఫెర్టిలిటీకి ప్రతికూలంగా చూడకుండా, శాస్త్రీయ ఆధారాలతో పరిశీలిస్తే అది కూడా ఒక అవకాశంగా మారుతుంది. సరైన సమాచారం, సమతుల్య జీవనశైలి ఉంటే, ప్రతి కాలం కూడా కొత్త జీవానికి ఆహ్వానం పలికే సమయమే.

# రాజా ది గ్రేట్... బీజేపీలోకి ఎమ్మెల్యే ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయన గట్టి నాయకుడు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే. పైగా బీజేపీ ఫిలాసఫీ అయిన హిందూత్వ మీద పూర్తిగా ఫైట్ చేసే ఒక నిఖార్సు అయిన నాయకుడు. అయితే ఆయనకు లోకల్ గా ఉంటే లీడర్లతో వివాదం ఉంది. అది ఆయన ఎక్కడా దాచుకోకుండా మీడియా ముందు మాట్లాడటం చిక్కు తెచ్చి పెట్టింది. దాంతో ఆయనను పార్టీ సస్పెండ్ చేసింది. ఆయనే గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.

**బంధం అలాగే :**

చిత్రమేంటి అంటే ఆయన సస్పెన్షన్ జరిగి చాలా కాలం అయినా ఆయన సభ్యత్వం తొలగించాలని స్పీకర్ కి బీజేపీ పెద్దలు ఇప్పటిదాకా లేఖ ఏదీ అధికారికంగా ఇవ్వలేదు. ఆయన బీజేపీ ఎమ్మెల్యేగానే అనధికారికంగా ఉంటున్నారు. ఆయన వాయిస్ కూడా అలాగే వినిపిస్తున్నారు. దాంతో ఆయన మీద బీజేపీ పెద్దలకు మనసు కరిగింది అని అంటున్నారు. ఈ క్రమంలో ఆయనను పార్టీ అధినాయకత్వం సస్పెన్షన్ ఎత్తేసి తిరిగి పార్టీలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

**బలమైన నేతగా :**

రాజా సింగ్ గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014, 2018, 2023 ఇలా మూడు సార్లు వరుసగా గెలిచారు ఇక 2018లో అయితే బీజేపీ నుంచి గెలిచిన ఏకైక మొనగాడుగా ఉన్నారు. గోషామహల్ అయితే కీలకమైన ప్రాంతం. అక్కడ ఒవైసీల ప్రాబల్యం ఉంటుంది. అలాంటి చోట బీజేపీ తరఫున గెలిచి కంచుకోట చేసిన రాజా సింగ్ కంటే గట్టి నేత తెలంగాణా బీజేపీలో లేరని కూడా అంటున్నారు.

**ఓటమి వెనక :**

బీజేపీ ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. దాని మీద కూడా పార్టీ సమీక్ష నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో రాజా సింగ్ వంటి వారు చేసిన కామెంట్స్ ని కూడా పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. బీజేపీకి తెలంగాణాలో గట్టి నాయకత్వం కావాలని రాజా సింగ్ డిమాండ్ చేశారు. బలమైన నేతను పెడితేనే పార్టీకి ఊపు వస్తుందని ఆయన సూచిస్తున్నారు. ఇపుడు కేంద్ర నాయకత్వం కూడా ఇవన్నీ చూస్తూ పరిశీలిస్తోంది అని అంటున్నారు.

**ఉండాల్సిందే అంటూ :**

ఈ నేపథ్యంలో పార్టీ ఫిలాసఫీని నమ్ముకుంటూ వరసగా గెలుస్తూ వస్తున్న రాజా సింగ్ లాంటి నేతలు పార్టీలో ఉండాల్సిందే అని అంటున్నారు. ఈ పరిస్థితులు అన్నీ రాజా సింగ్ కి అనుకూలంగా మారుతున్నాయని అంటున్నారు. ఇక మజ్లీస్ నేతల మీద నేరుగా పదునైన విమర్శలు చేసే సత్తా కూడా రాజా సింగ్ కే ఉందని అంటున్నారు. ఆయన ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా చేస్తున్న విమర్శలు బీజేపీ నేతలకు బూస్టింగ్ ఇస్తున్నాయని చెబుతున్నారు. మొత్తానికి రాజా సింగ్ మీద సస్పెన్షన్ ఎత్తేస్తూ ఒక కీలక ప్రకటన తొందరలోనే వస్తుందని అని ఆయన అనుచరులు అయితే కడు నమ్మకంగా చెబుతున్నారు. అంతే కాదు రానున్న కాలంలో తెలంగాణా బీజేపీలో రాజా సింగ్ కి అధిక ప్రాధాన్యత దక్కుతుందని కూడా అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పాక్ లో పండ్ల ధరలు ఇంత భారీనా? మన రూపాయిల్లో చూస్తే?





**హైదరాబాద్ పెన్ పవర్:** మన దేశానికి చెందిన వాగ్లర్ ఒకరు పాకిస్థాన్ లోని పండ్ల ధరల మీద చేసిన వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. అక్కడి పండ్ల ధరల్ని అడిగి తెలుసుకున్న వీడియోను అతను పోస్టు చేశాడు. ఇందులో కేజీ అరటిపండ్లు రూ.300గా ఉంటే.. బొప్పాయి అయితే కేజీ ధర రూ.400గా పేర్కొన్నారు. ఇలా పాకిస్థాన్ లో పండ్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వైనం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆ దేశంలోని పండ్ల ధరలతో పోలిస్తే.. మన దేశంలో చాలా చౌకగా ఉందన్న మాట వినిపిస్తోంది.అయితే.. ఇక్కడో విషయాన్ని మిస్ కాకూడదు. పాక్ లోని పండ్ల ధరల్ని ఆ దేశ వ్యాపారిని అడిగిన తెలుసుకొని.. పాకిస్థాన కరెన్సీలో చెప్పారు. మరి.. భారతీయ కరెన్సీలో దాన్ని కన్వర్ట్ చేస్తే ఎంత వస్తుందన్నది ఆసక్తికర అంశంగా చెప్పాలి. దానికి ముందు పాక్ రూపాయి మన భారత రూపాయితో మారకం చేసినప్పుడు ఎంత తేడా ఉందన్నది అర్థమైతే..మిగిలిన లెక్కల్ని తేలిగ్గా కట్టేయొచ్చు.

ప్రస్తుతం ఉన్న కరెన్సీ మారకం ధరల్ని చూస్తే.. ఒక భారత రూపాయి పాక్ కరెన్సీ అయిన రూపాయి లెక్కల్లోకి చూస్తే రూ.3.07 నుంచి 3.19 మధ్య ఉంటుంది. లెక్కలు మరింత తేలిగ్గా అర్థమయ్యేందుకు మన రూపాయి.. పాక్ కరెన్సీ మూడు రూపాయిలకు సమానంగా చెప్పాలి. అంటే.. పాక్ 30 రూపాయిలు భారత రూపాయిల్లో చెప్పాలంటే రూ.10 మాత్రమే. ఈ లెక్కన చూసినప్పుడు అరటిపండ్లు భారత కరెన్సీ ప్రకారం చూస్తే కేజీ 100గా,, బొప్పాయి రూ.130గా అర్థమవుతుంది.అరటి పండు ధరల్ని చూస్తే.. మన కంటే సరాసరిగా డబుల్ ధరలు ఉన్నాయని చెప్పొచ్చు. మన దేశంలో కేజీ అరటి రూ.35 నుంచి రూ.50 మధ్యలో ఉన్న విషయం తెలిసిందే. ఇక.. బొప్పాయి విషయానికి వస్తే.. పాక్ లోని ధరల్ని భారత రూపాయిల్లోకి మారిస్తే కేజీ రూ.133గా చెప్పాలి.భారత్ లో కేజీ బొప్పాయి రూ.30–50 మధ్యలో ఉండటం తెలిసిందే.

ఆసక్తికరమైన అంశం ఏమంటే.. భారత్ లో కేజీ యాపిల్ రూ.350–500 వరకు ఉంటే.. పాకిస్తాన్ లో మాత్రం కేవలం రూ.500మాత్రమే. అదే మన రూపాయిల్లో లెక్కేస్తే రూ.170 కంటే తక్కువగా చెప్పాలి. అదే ఖర్జురాల ధరలు పాక్ లో కేజీ 1200 పాకిస్థానీ రూపాయిలుగా చెప్పొచ్చు. అంటే.. కేజీ రూ.400. యాపిల్ ధరలు మన కంటే తక్కువగా ఉంటే.. ఖర్జురాల ధరలు కూడా మన ధరలకు దగ్గర దగ్గరగా ఉన్నట్లు చెప్పాలి.

## పాల్వంచలో పాయం ప్రత్యేక పూజలు



**కొత్తగూడెం, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** పాల్వంచలో శ్రీదేవి గోదాదేవి సమేత శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ప్రార్థించారు. ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఇంటర్మీడియట్ అధికారి

**పినపాక, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** పాల్వంచలోని పరీక్షా కేంద్రాలను ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాలను డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు గురువారం పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పని తీరు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను వారు పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## జిల్లా కలెక్టర్ భాదిలి.. నూతన కలెక్టర్ గా అంకిత్

**భద్రాచలం, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** జిల్లా నూతన కలెక్టర్‌గా అంకిత్ గురువారం నియమితులయ్యారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన అంకిత్‌ను కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కలెక్టర్ జితేష్ వి పాటిల్ టీజీ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజ్మెంట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ నియామకం ద్వారా జిల్లా పరిపాలనలో మార్పు చోటుచేసుకుంది.

## మహబుబాబాద్ కలెక్టర్ బదిలీ తో సంబరాలు

**డోర్నకల్, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బదిలీ అయిన సందర్భంగా, గురువారం మహబూబాబాద్ పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుతూ, జిల్లా అభివృద్ధికి ఆటంకంగా ఉన్న కలెక్టర్ బదిలీ కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మహబూబాబాద్ జిల్లాను ఆరు నెలల అభివృద్ధి వెనుకకు నెట్టి, అన్ని విధాలుగా నాశనం చేశారని నినాదాలు చేశారు.

## కలెక్టర్ బదిలీ తో రైతు భావోద్వేగం

**జనగామ, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బదిలీ అయ్యారని తెలిసి ఓ రైతు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆ రైతు, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌ను కలిసి, 'మంచి సార్ ట్రాన్స్‌ఫర్ అయ్యారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో మీరు ప్రత్యేక చొరవ చూపించారు' అని తన బాధను వ్యక్తం చేశాడు. కలెక్టర్ బదిలీతో రైతు తన ఆవేదనను వెళ్లగక్కాడు.

## సూదనపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**మహబూబాబాద్, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో గురువారం నూతన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ నీలం వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఉప సర్పంచ్ వెంపటి విజయ్ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వరంగల్ కోర్టుకు బాంబ్ బెదిరింపు

**పాలకుర్తి, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** వరంగల్ కోర్టుకు గుర్తుతెలియని వ్యక్తి నుండి బాంబు బెదిరింపు కాల్ రావడంతో కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించి, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. బాంబు ఉందా లేదా అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## హన్మకొండ కలెక్టర్‌గా చాహత్ బాజ్ పాయ్

**నర్సంపేట, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** హన్మకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి చాహత్ బాజ్ పాయ్ నియమితులయ్యారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం స్నేహ శబర్ష్ స్థానంలో బదిలీ చేసింది. కలెక్టర్ బాధ్యతలతో పాటు మున్సిపల్ కమిషనర్‌గానూ ఆమె పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. వరంగల్ జిల్లా భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ వై. వి. గణేష్ వరంగల్ అదనపు కలెక్టర్‌గా (స్థానిక సంస్థలు) బదిలీ అవుతారు.

# ఉపాధి హామీ పథకంపై ప్రజా వేదికలో అధికారుల తనిఖీ

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** బెల్లంపల్లి మండలానికి సంబంధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ కిషన్, ఎంపీడీవో మహేందర్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ రవి, విజిలెన్స్ అధికారి కిరణ్, ఏఈ విష్ణు, ఏపీఓ రజియాలు హాజరై, ఈజీఎస్ పనుల వివరాలను పరిశీలించి, ఒక్కొక్కటిగా అడిగి తెలుసుకున్నారు.

## అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రయ్య బదిలీ

**మంచిర్యాల, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** మంచిర్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రయ్య రాష్ట్ర వ్యాప్త ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా అదే జిల్లాలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమితులయ్యారు. జిల్లా యంత్రాంగంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన ఇకపై స్థానిక సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన త్వరలోనే కొత్త బాధ్యతలు స్వీకరించనున్నారు.

## మోసం గ్రామంలో పోచమ్మ అమ్మవారి ప్రాణప్రతిష్ఠ ఘనంగా

**సిర్పూర్, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** కాగజ్‌నగర్ మండలం మోసం గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు, వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమం పూర్తయింది. ముఖ్య అతిథులుగా కోనేరు కోనప్ప ? రమాదేవి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, గ్రామ శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రార్థించారు. సర్పంచ్ పద్మ ? వసంత్ రావు, ఉపసర్పంచ్ రోహిణి పుష్పలత ? రామయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

# కాగజ్‌నగర్ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు బీఆర్ఎస్ వినతి



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. రహదారుల దుస్థితి, పారిశుధ్యం, డ్రైనేజ్ లోపాలు, తాగునీటి అంతరాయాలపై దృష్టి సారించాలని వారు కోరారు. సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు

**చెన్నూరు, ఫిబ్రవరి 26( పెన్ పవర్:** ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎస్ జానకపూర్ 1వ వార్డులో అన్ని బోరింగ్ బావులను వార్డు కౌన్సిలర్ జాడి వినోద్ ఆధ్వర్యంలో గురువారం మరమ్మతులు చేయించారు. ఎండకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యగా ఈ పనులు చేపట్టారు. పనిచేయని బోరింగ్‌లను గుర్తించి, మోటార్లు, పైపులు సరిచేసి తిరిగి వినియోగానికి అందుబాటులోకి తెచ్చారు. స్థానిక ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని వేగంగా పనులు పూర్తి చేశారు. ఎండకాలంలో నీటి సమస్యలు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యమని కౌన్సిలర్ పేర్కొన్నారు.

## బాలిక అదృశ్యం..కేసు నమోదు

**పెద్దపల్లి, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** పెద్దపల్లి మండలానికి చెందిన ఓ బాలిక మిస్సింగ్ కాగా పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి రూరల్ ఎస్ ఐ మల్లేష్ బాధితుల ఇంటికి చేరుకొని బాలిక తల్లిదండ్రుల నుంచి ఇంటి వద్దే ఫిర్యాదు స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ మాట్లాడుతూ.. ఇంటి వద్దనే ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయడంతో పాటు స్పాట్ ఎఫ్ఐఆర్ కాపీని కుటుంబ సభ్యులకు అందించారు.

# సీఎం సహాయనిధి చెక్కుల మాయంపై విచారణ జరిపించాలి

**మంథని, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** శంకర్‌పట్నం మండలంలో జరిగిన సీఎం సహాయనిధి చెక్కుల మాయంపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. గురువారం మానకొండూరులోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెక్కుల మాయం ఘటనకు సంబంధించి బాధ్యులపై సీఏను వారం రోజుల్లో తొలగించాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. యూరియా కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా.. ఎమ్మెల్యే ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు యూరియాను అందజేయాలన్నారు.

## ఉద్యోగుల మూకుమ్మడి గైర్హాజరు!

**జగిత్యాల, ఫిబ్రవరి 26 పెన్ పవర్:** హుజూరాబాద్‌లోని ఆర్అండ్‌బీ డీఈఈ కార్యాలయంలోని సుమారు 10 మంది ఉద్యోగులు విధుల్లో లేకపోవడంతో పనుల కోసం వచ్చినవారు పడిగాపులు కాశారు. కార్యాలయాన్ని తెరచి వెల్లిన ఉద్యోగికి వారు ఫోన్ చేయగా తనకు ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈఈ రాజశేఖర్‌రెడ్డిని " చరవాణిలో మధ్యాహ్నం తరువాత సంప్రదించగా ఏఈఈ పెళ్లికి వచ్చానని ఒక ఉద్యోగి కార్యాలయంలో ఉన్నారని చెప్పారు. మిగతా ఇద్దరు ఏఈఈలు, ఒక సీనియర్ సహాయకులు, ఒక జూనియర్ సహాయకులు, ఇద్దరు అటెండర్లు, ముగ్గురు గ్యాంగ్‌మేన్లు లేరని అడగ్గా సరైన సమాధానం చెప్పకుండా దాట వేశారు.

# రామగుండం నూతన మేయర్‌గా మహంకాళి స్వామి బాధ్యతలు స్వీకరణ

**రామగుండం, ఫిబ్రవరి 26(ఎ.ఎం.ఎస్):** రామగుండం మేయర్ పదవిని మహంకాళి స్వామి గారు ఘనంగా స్వీకరించారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నగర అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజాసేవలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతామని మహంకాళి స్వామి గారు తెలిపారు. రామగుండం నగరాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# విద్యార్థి- ఉపాధ్యాయ నిష్పత్తి సరిదిద్దే ప్రయత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణే మార్గమా? అనే ప్రశ్న ఈ మధ్యకాలంలో రాష్ట్ర విద్యా వ్యవస్థలో కేంద్రబిందువుగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే అంశం కేవలం పరిపాలనా నిర్ణయంగా కాకుండా, ప్రభుత్వ విద్యా భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక విధానంగా చర్చకు వచ్చింది. విద్యార్థుల నమోదు తగ్గుదల, ఉపాధ్యాయుల అసమతుల పంపిణీ, ప్రభుత్వ వ్యయం సమర్థ వినియోగం వంటి అంశాలు ఈ నిర్ణయానికి నేపథ్యంగా నిలిచాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఈ ప్రక్రియను పూర్తిగా అమలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం, దీనిపై జరుగుతున్న రాజకీయ?సామాజిక చర్చలకు మరింత బలం చేకూర్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను వెనక్కి తిరిగి పరిశీలిస్తే, ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు, పదోన్నతులు తరచుగా ప్రాంతీయ, రాజకీయ ఒత్తిళ్లకు లోనైన సందర్భాలు అనేకం. ఒక దశలో విద్యార్థుల సంఖ్యకు మించిన ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలల్లో కేంద్రీకృతమవగా, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో కనీస అవసరానికి సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ గతంలో నిర్వహించిన అంతర్గత సర్వేలు ఈ అసమానతలను స్పష్టంగా చూపించాయి. కొన్ని పట్టణ పాఠశాలల్లో ఉపాధ్యాయ?విద్యార్థి నిష్పత్తి 1:15 లేదా 1:18గా ఉండగా, అదే సమయంలో గిరిజన మండలాల్లో ఈ నిష్పత్తి 1:55 నుంచి 1:65 వరకు పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ పరిస్థితి విద్యా నాణ్యతపై మాత్రమే కాకుండా, సమాన అవకాశాల సూత్రంపైనా తీవ్ర ప్రభావం చూపింది. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సుమారు లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు నాలుగు లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే విద్యార్థుల నమోదు సంఖ్య గత పది సంవత్సరాల్లో గణనీయంగా తగ్గింది. 2013?14లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య సుమారు 60 లక్షలుగా ఉంటే, 2023?24 నాటికి అది 40 లక్షల లోపుకు తగ్గినట్లు విద్యాశాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల విస్తరణ, పట్టణాలకు వలసలు, జనాభా ధోరణుల మార్పు, ఆంగ్లమాధ్యమంపై పెరుగుతున్న ఆసక్తి వంటి కారణాలు ఈ తగ్గుదలకు దోహదపడ్డాయి. విద్యార్థుల సంఖ్య తగ్గినా, ఉపాధ్యాయుల సంఖ్య అదే స్థాయిలో కొనసాగడం వల్ల అసమతులత మరింత పెరిగింది.

ఈ పరిస్థితుల్లోనే ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే భావన విధాన పరంగా ముందుకు వచ్చింది. హేతుబద్ధీకరణ అంటే ఉద్యోగాలను తొలగించడం కాదు, ఉన్న వనరులను అవసరమైన చోట అవసరమైనంతగా పంపిణీ చేయడం. విద్యార్థుల సంఖ్య, తరగతుల సంఖ్య, పాఠశాల స్థాయి, భౌగోళిక పరిస్థితులు వంటి ప్రమాణాల ఆధారంగా ప్రతి పాఠశాలకు ఎంతమంది ఉపాధ్యాయులు అవసరమో నిర్ణయించడం ఈ ప్రక్రియ యొక్క మూల ఉద్దేశం. ప్రభుత్వ నివేదికల ప్రకారం ప్రస్తుతం సుమారు 20 శాతం పాఠశాలల్లో అవసరానికి మించిన ఉపాధ్యాయులు ఉండగా, దాదాపు 30 శాతం పాఠశాలల్లో తీవ్ర కొరత ఉంది. ఒక పాఠశాలలో 30 నుంచి 40 మంది విద్యార్థులకు ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులు ఉండగా, మరో పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటం వంటి ఉదాహరణలు ఈ అసమతులతను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. జాతీయ విద్యా విధానం సూచనలు కూడా ఈ నిర్ణయానికి బలమైన ఆధారంగా నిలిచాయి. ప్రాథమిక స్థాయిలో 1:30, ప్రాథమికోన్నత స్థాయిలో 1:35 ఉపాధ్యాయ?విద్యార్థి నిష్పత్తి ఉండాలన్న మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా సూచించింది. ఈ ప్రమాణాలను అమలు చేయాలంటే కొత్త నియామకాలు చేపట్టడం కన్నా ముందుగా ఉన్న ఉపాధ్యాయులను సమర్థంగా వినియోగించడమే ఆచరణాత్మక మార్గమని రాష్ట్ర విద్యాశాఖ భావించింది. ఆర్థిక శాఖ అంచనాల ప్రకారం, హేతుబద్ధీకరణ పూర్తయితే ప్రతి సంవత్సరం వందల కోట్ల రూపాయల ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగంలోకి వస్తుంది. అవసరానికి మించిన ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో వేతనాలపై ఖర్చయ్యే అదనపు వ్యయం తగ్గి, కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా నాణ్యత మెరుగుపడే అవకాశం ఏర్పడుతుంది. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల స్పందన మిశ్రమంగా ఉంది. కొన్ని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలు హేతుబద్ధీకరణ అవసరాన్ని సూత్రప్రాయంగా అంగీకరిస్తూనే, అమలు విధానంపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగ భద్రతకు భంగం కలగకూడదని, బలవంతపు బదిలీలు కుటుంబ జీవనాన్ని అస్తవ్యస్తం చేయకూడదని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు, దూర ప్రాంతాలకు బదిలీ అయితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని సంఘాలు పేర్కొంటున్నాయి. మరోవైపు కొన్ని సంఘాలు మాత్రం సరైన డేటా ఆధారంగా, పారదర్శకంగా అమలు చేస్తే హేతుబద్ధీకరణ వల్ల ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అభిప్రాయ పడుతున్నాయి.

ప్రభుత్వం ఈ విమర్శలకు ప్రతిస్పందిస్తూ, హేతుబద్ధీకరణ వల్ల ఒక్క ఉపాధ్యాయుడి ఉద్యోగం కూడా పోదని, వేతనాలు తగ్గవని స్పష్టం చేసింది. బదిలీల్లో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానం, పాయింట్ల వ్యవస్థ అమలు చేస్తామని, సీనియారిటీ, సామాజిక పరిస్థితులు, వైద్య కారణాలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చింది. వేసవి సెలవుల కాలాన్ని వినియోగించి ఈ ప్రక్రియను పూర్తిచేయడం ద్వారా విద్యా సంవత్సరం మధ్యలో బోధనకు అంతరాయం కలగకుండా చూడాలన్నది ప్రభుత్వ వ్యూహం. జిల్లాల వారీగా డేటా సేకరణ, మండల స్థాయి సమీక్షలు, రాష్ట్ర స్థాయి ఆమోదం వంటి దశలను ఇప్పటికే ఖరారు చేసింది.


సామాజిక కోణంలో చూస్తే ఈ నిర్ణయం ఎంతో కీలకం. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలపై ఆధార పడుతున్నారు. అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉండటం అంటే నేరుగా ఆ వర్గాల భవిష్యత్తును దెబ్బతీయడమే. హేతుబద్ధీకరణ ద్వారా ఈ ప్రాంతాలకు తగినంత ఉపాధ్యాయులు అందుబాటులోకి వస్తే విద్యలో సమాన అవకాశాలు పెరుగుతాయి. ఇది రాజ్యాంగంలోని సమానత్వం, సామాజిక న్యాయం అనే సూత్రాలకు అనుగుణమైన చర్యగా భావించవచ్చు.అయితే ఈ ప్రక్రియలో సవాళ్లు కూడా తక్కువ కావు. తక్కువ విద్యార్థులున్న పాఠశాలల విలీనాలు, గ్రామ స్థాయిలో భావోద్వేగాలు, రాజకీయ ఒత్తిళ్లు ఈ సంస్కరణకు అడ్డంకులు కావచ్చు. కొన్ని గ్రామాల్లో పాఠశాల ఒక గుర్తింపుగా ఉండటం వల్ల మార్పులకు వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది. అందువల్ల ప్రభుత్వం కేవలం పరిపాలనా ఆదేశాలతో కాకుండా, తల్లిదండ్రుల సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి, విశ్వాసాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఒక కీలక విధాన మార్పు. ఇది సమర్థంగా, పారదర్శకంగా, మానవీయంగా అమలైతే ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి దారి తీసే అవకాశం ఉంది. విద్యా నాణ్యత మెరుగు పడటం, ఉపాధ్యాయ – విద్యార్థి నిష్పత్తి సమతుల్యం కావడం, ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగం కావడం వంటి లక్ష్యాలు సాధ్యమవుతాయి. అయితే ఈ ప్రయత్నం విజయం సాధిస్తుందా లేదా అన్నది పూర్తిగా అమలు విధానంపైనే ఆధారపడి ఉంటుంది. హేతుబద్ధీకరణ ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తును నిజంగా మారుస్తుందా అన్న ప్రశ్నకు సమాధానం రానున్న విద్యా సంవత్సరంలోనే స్పష్టమవుతుంది.

# రేవంత్ 'బదిలీల' రికార్డు.. దేశంలోనే టాప్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రం ఏదైనా.. ముఖ్యమంత్రి ఎవరైనా పాలన మీద పట్టు రావటానికి తనదైన టీం అవసరం చాలా చాలా ముఖ్యం. ఇందులో భాగంగానే తాము అధికారంలోకి వచ్చినంతనే తమకు సూట్ అయ్యే ఐఏఎస్.. ఐపీఎస్ లకు పోస్టింగులు ఇవ్వటం మామూలే. ఆ మాటకు వస్తే.. ఎన్నికల సమయానికే గెలుపు మీద ఆశలు ఉన్న పార్టీలు తాము పవర్ లోకి వచ్చినంతనే కీలక పదవులు ఎవరిని కేటాయించాలన్న దానిపై బ్లూప్రింట్ తయారు చేసుకోవటం మామూలే. ఇందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ సైతం మినహాయింపు లేదు. ఇప్పుడు ఆయనతో వచ్చిన చిక్కల్లా.. అధికారంలోకి వచ్చిన దగ్గర దగ్గర రెండున్నరేళ్లకు దగ్గరవుతున్నప్పటికి ఆయన తనదైన టీంను తయారు చేసుకోలేకపోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది.

(గురువారం) ఉదయమే తెలంగాణలో 45 మంది ఐఏఎస్ లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎప్పటిలానే పరిపాలనా అవసరాల దృష్ట్యా బదిలీలు చేసినట్లుగా పేర్కొన్నారు. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు.. పోస్టింగ్ లు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో రేవంత్ సర్కారు కొలువు తీరినప్పటి నుంచి ఇప్పటివరకు ఐఏఎస్ లు.. ఐపీఎస్ లు ఎన్నిసార్లు బదిలీ అయ్యారన్నది చూస్తే.. ఆశ్చర్యానికి గురి కావాల్సిందే. 2023లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు అంటే సుమారు 26 నెలల 19 రోజుల్లో కనీసం 18సార్లు ఐఏఎస్ లు బదిలీ అయ్యారు.

2024లో మొత్తం 11 సార్లు బదిలీలు జరిగాయి 2024లో జనవరిలో మూడు సార్లు.. ఫిబ్రవరిలో 2సార్లు.. జూన్ లో 2సార్లు.. జులై, ఆగస్టు, అక్టోబరు, డిసెంబరులో ఒక్కోసారి చొప్పున బదిలీలు జరిగాయి. అంటే.. ఏడాదిలో ఏడు నెలల్లో బదిలీలు జరగటం గమనార్హం. 2025లో చూస్తే.. ఐదుసార్లు బదిలీలు జరిగాయి. సరాసరి చూస్తే.. ప్రతి రెండున్నర నెలలకు ఒకసారి బదిలీలు జరిగాయని చెప్పొచ్చు. ఈ ఏడాది (2026) ఇప్పటివరకు 2 నెలలు కూడా గడవలేదు. ఇప్పటికే రెండుసార్లు పెద్ద ఎత్తున బదిలీలు అయ్యాయి. ఈ రోజుతో కలిపి ఈ నెలలో 55 మంది ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేయటం గమనార్హం.




ఐపీఎస్ ల విషయానికి వస్తే.. ముఖ్యమంత్రిగా రేవంత్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటివరకు 18–20 సార్లు బదిలీలు జరిగాయి. ఐపీఎస్ ల బదిలీలను చూస్తే ప్రతి ఒకట్రెండు నెలలకు చిన్నపాటి కానీ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బదిలీలు జరగటం కనిపిస్తుంది. 2024లో ఐదు నుంచి ఏడుసార్లు ఐపీఎస్ ల బదిలీల రిగితే.. 2025లో ఏకంగా పదిసార్లు బదిలీలు జరిగాయి. 2026లో ఈ రెండు నెలల్లో ఇప్పటికి మూడుసార్లు బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. రేవంత్ ప్రభుత్వంలో ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలు కొంచెం ఎక్కువగా జరుగుతున్నపరిస్థితి.ఒక ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొదటి రెండేళ్లలో భారీ ఎత్తున బదిలీలు కామన్. కానీ రెండేళ్లు దాటిన తర్వాత కూడా అదే పనిగా బదిలీలుజరగటమే కాస్తంత గందరగోళానికి గురి చేయటంతో పాటు.. అధికారుల్లో అభద్రతాభావానికి గురి చేస్తుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు గడిచిన రెండేళ్లలో అత్యధిక ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు ఎక్కువగా జరిగిన టాప్ 5 రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని చెప్పాలి. గణాంకాల వారీగా చూస్తే.. జాబితాలో ఉత్తరప్రదేశ్ కనిపిస్తుంది. కాకుంటే..యూపీ పెద్ద రాష్ట్రం కావటంతో దాన్ని మినహాయిస్తే.. జాబితాలో తెలంగాణ టాప్ ప్లేస్ లో నిలుస్తుంది.ఇక్కడే మరో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. మన దేశంలో సరాసరిన ఒక ఐఏఎస్, ఐపీఎస్ అధికారి

ఒకే పోస్టులో 15 నెలలు మాత్రమే ఉంటున్నారు. తెలంగాణ, యూపీలో మాత్రం ఇది 8–10 నెలలకే పడిపోవటం గమనార్హం. అత్యధిక బదిలీలు జరిగిన రాష్ట్రాల్లో తెలంగాణ తర్వాత ఏపీ.. రాజస్థాన్.. బిహార్ రాష్ట్రాలు ఉన్నాయి. బదిలీలుఅదే పనిగా జరిగే పాలన మీద పట్టు రావటం కష్టమవుతుంది. ప్రభుత్వ విధానాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో ఐఏఎస్ లు కీలకంగా వ్యవహరిస్తారు. ఎంత సీనియర్ అధికారి అయినప్పటికి వారికి కేటాయించిన ప్లేస్ లో పనిని అర్థం చేసుకోవటానికి.. సిబ్బంది మీద పట్టు రావటానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఈ పరిస్థితుల్లో బదిలీల మీద కంటే పాలన మీద సీఎం రేవంత్ ఫోకస్ చేస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వైసీపీ చేజారిన నెల్లూరు.. మేయర్ ఎన్నికల్లో ట్విస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** నెల్లూరు నూతన మేయర్ గా టీడీపీ మహిళా నేత దేవరకొండ సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు పోటీగా ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో సుజాత ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఈ ఎన్నికతో నెల్లూరు నగరంపై టీడీపీ కూటమి పూర్తిస్థాయిలో ఆధిపత్యం చెలాయించినట్లు అయిందని చెబుతున్నారు. నగరంలోని రెండు ఎమ్మెల్యే స్థానాలుతోపాటు కార్పొరేషన్ ను కైవసం చేసుకుని టీడీపీ చరిత్రను సృష్టించిందని వ్యాఖ్యానిస్తున్నారు. 2021 నవంబరులో నెల్లూరు కార్పొరేషన్ కు ఎన్నికలు జరిగాయి. గత ఏడాది నవంబరులో మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. డిసెంబరులో ఎన్నిక జరగాల్సివుండగా, అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.మేయర్ స్రవంతి రాజీనామాతో ఉప ఎన్నిక నిర్వహించాల్సివచ్చింది. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నెల్లూరు నగరంలో 54 డివిజన్లను వైసీపీ కైవసం చేసుకుంది. టీడీపీకి ఒక్కటి అంటే ఒక్క డివిజన్ దక్కలేదు. అయితే నాలుగేళ్ల తిరిగే సరికి రాజకీయం పూర్తిగా తలకిందులైంది. వైసీపీ తరపున గెలుపొందిన వారిలో 40 మంది టీడీపీలో చేరిపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీడీపీ అధికారంలోకి రావడం, గతంలో వైసీపీలో ఉన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎన్నికలకు ముందే టీడీపీలో చేరి, మరోసారి ఎన్నిక అవడంతో నగరంలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది.నెల్లూరు సిటీతోపాటు రూరల్ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేలు గెలవడంతో మేయర్ పదవి కోసం ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టారు. ఇదేసమయంలో గతంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి అనుచరులుగా వ్యవహరించిన మాజీ మేయర్ స్రవంతి దంపతులు రాజకీయంగా శ్రీధర్ రెడ్డితో విభేదించడంతో కార్పొరేటర్ల అవిశ్వాసానికి గురయ్యారు. తొలుత పదవి నుంచి తప్పుకోవాలని టీడీపీలో చేరిన కార్పొరేటర్లు మాజీ మేయర్ స్రవంతిపై ఒత్తిడి చేయగా, ఆమె ససేమిరా అనడంతో గత నవంబరులో అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. అయితే వైసీపీకి చెందిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ రంగంలోకి దిగి టీడీపీలో చేరిన 6 కార్పొరేటర్లను వెనక్కి రప్పించడంతో నెల్లూరు రాజకీయం ఊహించని మలుపు తిరిగింది.మాజీ మంత్రి అనిల్ కుమార్ ఎంట్రీతో మేయర్ పదవిని వైసీపీ కాపాడుకునేలా కనిపించింది. అయితే అనిల్ కుమార్ రాజకీయాన్ని ఒక్క రోజులోనే టీడీపీ నేతలు చిత్తు చేశారు. వైసీపీకి వెళ్లిన నేతలు మళ్లీ వెనక్కి రావడంతో అవిశ్వాసం ఎదుర్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో మేయర్ స్రవంతి తన పదవికి రాజీనామా చేశారు. దీంతో గురువారం మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించారు. వైసీపీకి తగిన బలం లేకపోవడంతో ఎన్నికను బహిష్కరించింది. ఫలితంగా టీడీపీ బలపరిచిన దేవరకొండ సుజాత మేయర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికతో గత 20 నెలలుగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజకీయం చల్లబడినట్లైందని అంటున్నారు.

# ఆర్థిక వ్యవస్థలో.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ 20 దేశాల లైఫ్ టైం ఎంతంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** డబ్బు సంపాదనలో ప్రపంచ దేశాలన్నీ పోటీ పడుతున్నాయి సరే, మరి ఆ సంపాదించిన ధనం మనిషి ప్రాణాన్ని ఎంత కాలం నిలబెడుతోంది? ఒక దేశం ఆర్థికంగా ఎంత బలంగా ఉందన్నది ముఖ్యం కాదు, అక్కడ ప్రజలు ఎన్ని ఏళ్లు ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నదే అసలైన అభివృద్ధికి నిదర్శనం. అమెరికా వంటి అగ్రరాజ్యాల నుంచి ఎదుగుతున్న భారత్ వరకు.. టాప్ 20 ఎకానమీ దేశాల్లో సగటు మనిషి ఆయుష్షు లెక్కలు బయటపడ్డాయి. కొన్ని దేశాల్లో వంద ఏళ్లకు చేరువగా బతుకుతుంటే, మరికొన్ని చోట్ల ఆర్థికంగా బాగున్నా ఆయుష్షు దగ్గరకు వచ్చేసరికి వెనుకబడి ఉండటం గమనార్హం. అసలు ఏ దేశస్తులు ఎక్కువ కాలం జీవిస్తున్నారు? మన భారత్ ఏ స్థానంలో ఉంది? అనే విషయాల గురించి ఇప్పుడు చూద్దాం..

**జపాన్ జైత్రయాత్ర.. ఆయుష్షులోనూ అగ్రస్థానమే:**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో టాప్ దేశాలను పరిశీలిస్తే, ఆయుష్షు విషయంలో జపాన్ అందరికంటే ముందుంది. అక్కడ సగటున ఒక వ్యక్తి 85 ఏళ్లు జీవిస్తున్నారు. జపాన్ తర్వాత ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, సౌత్ కొరియా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాలు 84 ఏళ్ల సగటుతో పోటాపోటీగా ఉన్నాయి. ఇక యూరప్ దేశాలైన జర్మనీ, బ్రిటన్ 82 ఏళ్లు మరియు నెదర్లాండ్స్ 83 ఏళ్లు కూడా తమ పౌరులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందిస్తున్నాయి. ఈ దేశాల్లో ఉన్న అత్యుత్తమ వైద్య సదుపాయాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వారు ఎక్కువ కాలం బతకడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**అగ్రరాజ్యాల పరిస్థితి.. అమెరికా, చైనా ఎక్కడ ఉన్నాయి:**

ఆర్థికంగా ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా మరియు చైనాలు ఆయుష్షు విషయంలో మధ్యస్థంగా ఉన్నాయి. అమెరికాలో సగటు ఆయుర్దాయం 80 ఏళ్లు కాగా, చైనాలో అది 79 ఏళ్లుగా ఉంది. సౌదీ అరేబియా కూడా 80 ఏళ్లతో అమెరికాతో సమానంగా నిలిచింది. అభివృద్ధి చెందుతున్న దేశాలైన బ్రెజిల్, మెక్సికోలు 76 ఏళ్ల వద్ద ఉండగా, రష్యా 74 ఏళ్లతో మరికొంచెం వెనుకబడి ఉంది. ఇక సంపద పెరిగినంత వేగంగా ఈ దేశాల్లో సగటు ఆయుర్దాయం పెరగకపోవడం వెనుక.. పెరిగిన పని ఒత్తిడి, కాలుష్యం లేదా మారుతున్న ఆహారపు అలవాట్లు ప్రభావం చూపుతున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

**భారత్ ఎక్కడ? మన పరిస్థితి ఏంటి:**

ఇక మన దేశం విషయానికి వస్తే, టాప్ 20 ఆర్థిక వ్యవస్థల్లో భారత్ 73 ఏళ్ల సగటు ఆయుర్దాయంతో ఉంది. ఇండోనేషియా 72 ఏళ్లు కంటే మనం మెరుగ్గా ఉన్నప్పటికీ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం ఇంకా ఎంతో పురోగతి సాధించాల్సి ఉంది. ఇక గత కొన్ని దశాబ్దాలుగా మన దేశంలో వైద్య సదుపాయాలు మెరుగుపడటం, శిశు మరణాలు తగ్గడం వల్ల ఈ స్థాయికి చేరుకోగలిగాం. పోలాండ్ 79, టర్కీ 78 వంటి దేశాలు మనకంటే ముందున్నాయి. దేశం ఆర్థికంగా 5 ట్రిలియన్ డాలర్ల దిశగా ఎదుగుతున్న తరుణంలో, పౌరుల ఆయుష్షు కూడా పెరిగేలా ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసుకోవడం మన ముందున్న అతిపెద్ద సవాలు అంటున్నారు నిపుణులు.

# మండలిలో ఎమ్మెల్సీల ఫైట్.. సోము వీర్రాజు Vs వైసీపీ సభ్యులు



**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దల సభ శాసనమండలిలో గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. సీనియర్ నేత, బీజేపీ సభ్యుడు సోము వీర్రాజుపై వైసీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు దూసుకురావడంతో సభలో మిగిలిన సభ్యులు షాక్ తిన్నారు. ఈ ఊహించని పరిణామంతో చైర్మన్ మోషేన్ రాజు సైతం విస్మయానికి గురయ్యారని అంటున్నారు. దీంతో సభను కొద్దిసేపు వాయిదా వేయాల్సివచ్చిందని చెబుతున్నారు. మండలిలో వైసీపీ సభ్యుల తీరు తీవ్ర చర్చకు దారితీసింది. సీనియర్ నేత సోము వీర్రాజుపై దాడికి యత్నించారన్న సమచారం ఇటు అసెంబ్లీ లోపల బయట కూడా హాట్ టాపిక్ గా మారింది.శాసనమండలిలో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై హాట్ డిబేట్ జరిగింది. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. ఈ చర్చ పూర్తయిన తర్వాత బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడేందుకు నిల్చొన్నారు. అయితే మంత్రి సమాధానంపై సంతృప్తి చెందని వైసీపీ సభ్యులు అనుబంధ ప్రశ్నలు అడిగేందుకు అవకాశం ఇవ్వాలని చైర్మన్ ను కోరారు. ఇందుకు ఆయన నిరాకరించి తదుపరి ప్రశ్నపై బీజేపీ సభ్యుడు వీర్రాజుకు చాన్స్ ఇచ్చారు.చైర్మన్ అనుమతితో సభలో మాట్లాడేందుకు సోము వీర్రాజు సమాయత్తం అవుతుండగా, వైసీపీకి చెందిన ఎమ్మెల్సీలు ఇజ్రాయెల్, పాలవలస విక్రాంత్, రమేశ్ యాదవ్ ఒక్క ఉదుటన దూసుకెళ్లారు. సోము వీర్రాజు వైపు ముగ్గురు వైసీపీ ఎమ్మెల్సీలు దూకుడుగా రావడం చూసిన మంత్రులు అనిత, గొట్టిపాటి రవి వారిని అడ్డుకున్నారని చెబుతున్నారు. తాము నిరసన చెబుతుంటే సోము వీర్రాజు మైక్ తీసుకోవడం ఏంటని వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయెల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముగ్గురు ఎమ్మెల్సీల దూకుడుతో సభలో గందరగోళం నెలకొనడంతో చైర్మన్ మోషేన్ రాజు కాసేపు సభను వాయిదా వేశారు.

ఈ పరిణామం అసెంబ్లీ లాబీల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పెద్దల సభలో హుందాగా నడుచుకోవాల్సిన సభ్యులు ఇలా

దురుసుగా నడుచుకోవడం ఏంటని అధికార పార్టీ నేతలు ఖండిస్తున్నారు. అయితే తాము దౌర్జన్యం చేయలేదని, అధికారపక్షం కావాలనే దుష్ప్రచారం చేస్తోందని వైసీపీ ఎమ్మెల్సీలు వివరణ ఇస్తున్నారు. అయితే సభ్యులు దుందుడుకు ప్రవర్తన వల్లే సభను వాయిదా వేశారని కూటమి ఎమ్మెల్సీలు విమర్శలు చేస్తున్నారు. మొత్తానికి ఈ సంఘటన శాసనమండలిని మరోసారి వేడెక్కించింది. ఈ బడ్జెట్ సమావేశాలు ఆరంభం నుంచి శాసనమండలి చర్చల్లో వైసీపీ సభ్యులు ప్రభుత్వంపై గట్టిగా పోరాడుతున్నారు. తాజా సంఘటనతో తమ వాదనలకు శాసనమండలిని వేదికగా చేసుకునేలా వైసీపీ గట్టిగా ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు.

# జ్యూడిషియరీ ఈజ్ బ్లీడింగ్.. సుప్రీం సీరియస్




**హైదరాబాద్ పెన్ పవర్:** 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పేరుతో ఎన్ సీఈఆర్ టీ ఇటీవల ప్రచురించిన పాఠ్య పుస్తకాల వ్యవహారం పెను సంచనలంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం సీరియస్ గా స్పందించింది. ఇప్పటికే దీనిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ రోజు నిర్వహించిన విచారణ సందర్భంగా తీవ్రఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎనిమిదో తరగతి సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకం ప్రచురణ. పున:ముద్రణతో పాటు డిజిటల్ పంపిణీపై కోర్టు పూర్తిస్థాయి నిషేధం విధించింది. ఇప్పటికే మార్కెట్ లోకి స్కూళ్లకు వెళ్లిన అన్ని పుస్తకాల్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

అంతేకాదు ఆన్ లైన్ ప్లాట్ ఫారమ్ లు, ఎన్ సీఈఆర్ టీ వెబ్ సైట్ నుంచి ఈ పుస్తకానికి సంబంధించిన పీడీఎఫ్ ఫైళ్లను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ వివాదాస్పద కంటెంట్ వెనుక ఉన్న అసలు కారణాల్ని వివరించటంతో పాటు.. వారిపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని కోరుతూ ఎన్ సీఈఆర్ టీ, విద్యాశాఖ కార్యదర్శికి సుప్రీంకోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ పాఠ్యాంశాల్ని రూపొందించిన వారు ఎవరు? ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకున్నారు? లాంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదిక తమకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఈ ఉత్తర్వులు అమలు చేసి.. రెండు వారాల్లో సమగ్ర రిపోర్టును సమర్పించాలని కోర్టు పేర్కొంది.

ఈ వ్యవహారంపై ఎన్ సీఈ ఆర్ టీ బహిరంగ క్షమాపణలు తెలియజేసింది. ఈ అధ్యాయాన్ని సమర్పించి.. నిపుణుల సలహాతో తిరిగి రాస్తామన్న హామీ ఇచ్చింది.తాజాగా జరిగిన విచారణలో సీజేఐ సీరియస్ అయ్యారు. ఎన్ సీఈఆర్ టీ తరఫు సొలిసిటర్ జనరల్ కోర్టుకు క్షమాపణలు తెలియజేయగా.. సీజేఐ దాన్ని తోసిపుచ్చారు. ఎన్ సీఈఆర్ టీ పంపిన నోట్ లో ఒక్కచోట కూడా క్షమాపణ లేదని.. పైగా వారు పంపిన నోట్ లో తమ చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేశారంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీజేఐ స్పందిస్తూ.. వివాదాస్పద పాఠ్యాంశాలను రూపొందించిన వారిని విధుల్లో నుంచి తొలగిస్తామని సుప్రీంకోర్టుకు హామీ ఇవ్వటంపై స్పందించిన సీజేఐ.. ఇప్పటికే వారు పిస్టల్ తో కాల్పులు జరిపారని.. ఇప్పుడు న్యాయవ్యవస్త రక్తం ఓడుతోందన్నారు. "కేవలం తొలగించటం వల్ల ప్రయోజనం లేదు. వారు శిక్ష నుంచి తప్పించుకోలేరు' అంటూ స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థ అవినీతిమయమని విద్యార్థులకు.. ఉపాధ్యాయులకు బోధిస్తే సమాజానికి ఎలాంటి సందేశం వెళ్తుంది? అని ప్రశ్నించిన సీజేఐ.. "తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దీనిని నేర్చుకుంటే వ్యవస్థపై నమ్మ కం ఏమవుతుంది?" అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇది అనుకోకుండా జరిగిన పొరపాటు కాదని.. న్యాయవ్యవస్థ గౌరవాన్ని తగ్గించటానికి లోతైన.. పక్కాగా ప్లాన్ చేసిన కుట్రగా అభివర్ణించారు.న్యాయవ్యవస్థపై దాడులు పెరుగుతున్న సమయంలోనూ తాము ఎంతో సంయమనం.. సమతుల్యతను పాటిస్తున్నామని.. ఇలాంటి ఉద్దేశపూర్వక దాడుల్ని సహించమన్నారు. " సంస్థ అధిపతిగా దీనికి బాధ్యులైన వారు ఎవరని తేల్చటం నా బాధ్యత. దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే"అని స్పష్టం చేశారు. అనంతరం ఎన్ సీఈఆర్ టీ డైరెక్టర్, విద్యాశాఖ కార్యదర్శికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# ఆంథ్రోపిక్: రూ.1030 కోట్ల పెట్టుబడి.. తొలి ఏడాది ఆదాయం సున్నా




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెక్ రంగాన్ని ఆంథ్రోపిక్ క్రియేట్ చేస్తున్న ప్రకంపనలు అంతా ఇంతా కాదు. కొత్త ఏఐ మోడళ్లతో సంచలనానికి కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. దీంతో.. ఈ సంస్థ మార్కెట్ విలువ అనతికాలంలో రికార్డు స్థాయికి చేరింది. ప్రపంచంలో మరే టెక్ కంపెనీ సాధించని ఎన్నోరికార్డుల్ని ఆంథ్రోపిక్ సొంతం చేసుకుంటోంది. ఐదేళ్ల క్రితం స్టార్టప్ గా మొదలెట్టిన ఈ సంస్థ.. ఈ రోజున మార్కెట్ విలువలో దిగ్గజ టెక్ కంపెనీల్ని ఇట్టే దాటేస్తోంది. సింపుల్ గా చెప్పాలంటే ఆంథ్రోపిక్ దూకుడుకు తోపు టెక్ కంపెనీలు సైతం బెంబేలెత్తిపోతున్నాయి. దీంతో.. ఆంథ్రోపిక్ తో జత కట్టేందుకు.. దాని టూల్స్ ను వాడుతున్నట్లుగా ప్రకటించటం ద్వారా మార్కెట్ లో తన ఇమేజ్ ను కాపాడుకోవటమే కాదు.. మార్కెట్ లో తన ముఖ విలువను కాపాడుకోవటం ఆసక్తికరంగా మారింది. తాజాగాఈ సంస్థ విలువ అనేక టెక్ దిగ్గజాల్ని దాటేసింది. ఈ రోజున ఆంథ్రోపిక్ విలువ ఏకంగా 380 బిలియన్ డాలర్లకు చేరుకుంది. మన రూపాయిల్లో చెప్పాలంటే..అక్షరాల రూ.34.54 లక్షల కోట్లుగా లెక్క వేస్తున్నాయి.ఓపెన్ ఏఐ నుంచి కొందరు బయటకు వచ్చి.. సొంతంగా మొదలెట్టిన ఈ స్టార్టప్ దెబ్బకు తిరుగులేని సత్తా చాటే టెక్ కంపెనీలు సైతం ఈ రోజున హడలిపోయే పరిస్థితి. ఇక్కడే ఆంథ్రోపిక్ గురించి కొన్ని ఆసక్తికర అంశాల్ని చెబితే విస్మయానికి గురి కావటం ఖాయం. 2021లో ఈ సంస్థను ప్రారంభించారు. దీన్ని ఆరంభించే వేళలో దీని మీద పెట్టిన పెట్టుబడి లెక్క గురించి తెలిస్తే అవాక్కు కావటం ఖాయం. ఆ రోజున (అంటే 2021లో) రూ.1030 కోట్ల భారీ మొత్తంతో దీన్ని ఏర్పాటు చేశారు. మరో షాకింగ్ అంశం ఏమంటే.. ఈ కంపెనీ ఏర్పాటు చేసిన మొదటి ఏడాది దాని ఆదాయం అక్షరాల సున్నా కావటం గమనార్హం.

ఈ సంస్థ తన మొదటి ప్రొడక్ట్ ను 2023 మార్చి 14న అధికారికంగా మార్కెట్ లోకి విడుదల చేసింది. అయితే.. దీనికి కాస్త ముందే క్లోజ్డ్ బీటా వెర్షన్ ను పరీక్షలు నిర్వహించింది. ఆంథ్రోపిక్ తన మొదటి ఆదాయాన్ని 2022 జనవరిలో నమోదు చేసింది. ఈ ఏడాది ఈ సంస్థ దాదాపు రూ.83 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. అదే సమయంలో 2023లో సుమారు రూ.830 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. 2026 ఫిబ్రవరి నాటికి ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకెళుతున్న సంస్థగా ఆవతరించటం గమనార్హం. ఇప్పుడు సంస్థ వార్షిక ఆదాయం ఊహించని రీతిలో పెరిగింది. ఇప్పుడు ఈ సంస్థ ఆదాయం ఎంతో తెలుసా? అక్షరాల రూ.1.15 లక్షల కోట్లు. సాఫ్ట్ వేర్ రంగ చరిత్రలోనే అత్యంత వేగమైన వృద్ధిగా దీన్ని పేర్కొనాలి. ఇక్కడే ఈ సంస్థకు చెందిన రెండు నమ్మలేని నిజాల్ని ఇక్కడ ప్రస్తావించాల్సిందే. అదేమంటే.. ఈరోజున ఇంత భారీగా ఆదాయాన్ని జనరేట్ చేస్తున్న ఆంథ్రోపిక్ ఈ రోజుకు నష్టాల్లోనే ఉంది.అదే సమయంలో లాభాల్లోకి రావటానికి మరికొంత సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. దీనికి కారణం ఏఐ మీద పెడుతున్న ఖర్చే ఇందుకు కారణంగా చెప్పాలి. ఏఐ మోడళ్ల శిక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. ఈ ఏడాదిలో కేవలం కొత్త ఏఐ మోడళ్లను తయారు చేయటానికే రూ.99,600 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోంది. అందుకే.. ఈ సంస్థ భారీగా ఆదాయాన్ని నమోదు చేసుకున్నప్పటికి నేటికి ఈ సంస్థ నికరంగా నష్టాల్లోనే నడుస్తోంది. అయితే.. తమ మీద తమకున్న నమ్మకంతో పాటు.. తాము తీసుకున్న నిర్ణయాలు కచ్చితంగా కాసులు కురిపిస్తాయన్న ఆత్మవిశ్వాసంతో ఉంది ఆంథ్రోపిక్స్. సాహసం.. పక్కా లెక్కలతో ముందుకు వెళుతున్న సంస్థగా ఆంథ్రోపిక్ సరికొత్త రికార్డుల్ని క్రియేట్ చేస్తుందని చెప్పక తప్పదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## అమెరికాకు ఇది స్వర్ణయుగం: ట్రంప్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాకు స్వర్ణయుగం మళ్లీ ప్రారంభమైందని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని అన్నా రు. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను సమర్థించారు. 2026 స్టేట్ ఆఫ్ ది యూని యన్ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అలాగే భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపినట్టు పునరుద్ఘాటించారు. అలాగే అణు ఒప్పందం చేసుకోకపోతే దాడులు తప్పవు అంటూ హెచ్చరించారు. 'అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి 10నెలల్లోనే నేను ఎనిమిది యుద్ధాలు ముగించా. కంబోడియా– థారులాండ్, పాకిస్థాన్–భారత్ మధ్య అణు యుద్ధం జరిగేదే. నా జోక్యం లేకపోతే 3.5 కోట్ల మంది చనిపోయేవారని పాకిస్థాన్ ప్రధాని అన్నారు. నేను అధ్యక్షుడిగా ఉన్నట్లయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం జరిగేది కాదు. రెండు దేశాల మధ్య జరుగుతున్న హింసను ఆపేందుకు మా ప్రభుత్వం కషి చేస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే భారత్ యుద్ధాన్ని ప్రస్తావిస్తున్నప్పుడు తాను లేకపోతే పాక్ ప్రధాని చనిపోయి ఉండేవారని ట్రంప్ నోరు జారారు. కానీ వెంటనే 3.5 కోట్ల మంది యుద్ధంలో చనిపోయే వారని పాక్ ప్రధాని తనతో చెప్పినట్లు వెల్లడించారు.

## 40 దేశాల కోళ్లు, గుడ్లపై సౌదీ నిషేధం జాబితాలో భారత్

**హైదరాబాద్ పెన్ పవర్:** అరబ్ దేశం సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. 40 దేశాల నుంచి కోళ్లు, గుడ్లు దిగుమతులపై పూర్తి నిషేధం విధించింది. ప్రజారోగ్యం, ఆహార భద్రత వంటి కారణాల దష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సౌదీ వెల్లడించింది. నిషేధించిన దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆరోగ్య పరిణామాలు, అంటువ్యాధులు వంటి అంశాలను సమీక్షించి ఈ నిషేధం విధించినట్టు సౌదీ ఫుడ్ అండ్ డ్రగ్ అథారిటీ వెల్లడించింది. 40 దేశాల నుంచి పౌల్ట్రీ, గుడ్లపై సంపూర్ణ నిషేధం అమల్లో ఉంటుందని పేర్కొంది. ఈ జాబితాలో భారత్‌తో పాటు అఫ్గానిస్థాన్, చైనా, జర్మనీ, ఇండోనేషియా, యూకే, జపాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలు ఉన్నాయి. ఇక, మరో 16 దేశాల్లోని నిర్దిష్ట ప్రాంతాలపై పాక్షిక ఆంక్షలు విధించింది. ఆస్ట్రేలియా, అమెరికా, ఇటలీ, భూటాన్, ఫ్రాన్స్ వంటి దేశాలపై ఈ పాక్షిక ఆంక్షలు అమలవుతాయని తెలిపింది. అయితే, ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వేడి చేసిన పౌల్ట్రీ మాంసం, దాని సంబంధిత ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తించబోదని సౌదీ అధికారులు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో బర్డ్‌ఫ్లూ, వైరస్ వంటి ఆందోళనల నేపథ్యంలోనే సౌదీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## ఇరాన్‌పై దాడులు ప్రమాదకరం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో యుద్ధమంటూ గత కొన్ని రోజులుగా తన చర్యలతో సంకేతాలిస్తున్న అమెరికా మేకపోతు గాంభీర్యాన్నే ప్రదర్శిస్తోందా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఇందుకు యూఎస్ టాప్ జనరల్ డాన్ కెయిన్.. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను హెచ్చరించినట్టుగా యూఎస్ మీడియాలో వచ్చిన కథనాలే ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. అయితే ట్రంప్ మాత్రం ఈ వార్తలపై తీవ్రంగా స్పందించారు. వాటిని ఫేక్ న్యూస్‌గా కొట్టిపారేస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇరాన్‌తో యుద్ధం మధ్యప్రాచ్యంలోనే కాదు.. దాని ప్రభావం యూఎస్ పైనా ఉంటుందని యూఎస్ జనరల్ డాన్ కెయిన్ హెచ్చరిక చేసినట్టు లీకులు వచ్చాయి. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మెన్, ఎయిర్ ఫోర్స్ జనరల్ డాన్ కెయిన్ ఇరాన్‌పై దాడులు ప్రమాదకరమని చెప్పినట్టు యూఎస్ మీడియా కథనాలు వెలువర్చింది. అది అమెరికాను దీర్ఘకాలిక సంఘర్షణలోకి లాగవచ్చని హెచ్చరించారని కూడా వివరించింది. జనరల్ కెయిన్‌తో పాటు ఇతర పెంటగాన్ అధికారులు అంతర్గత సమావేశాలలో ఇరాన్‌పై యూఎస్ సైనిక చర్య ప్రమాదాల గురించి తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తారని ఆక్సియోస్, ది వాషింగ్టన్ పోస్ట్‌తో సహా పలు మీడియా సంస్థలు నివేదించాయి. ఈ మేరకు 'విశ్వసనీయ వర్గాల సమాచారం'ను ఉటంకించాయి. ఈ వార్తలను మొదట నివేదించిన ఆక్సియోస్.. ట్రంప్ అంతర్గత వర్గాలలోని అనేక మంది వ్యక్తులలో కెయిన్ ఒకరని పేర్కొంది. కెయిన్‌తో పాటు పెంటగాన్ అధికారులు అధ్యక్షుడిని జాగ్రత్తగా ముందుకు సాగాలని కోరారని కథనాలు వివరించాయి. అమెరికా వద్ద కీలక మునిషన్స్ నిల్వలు తక్కువగా ఉన్నాయనీ, ముఖ్యంగా క్షిపణి రక్షణ వ్యవస్థలకు సంబంధించిన ఆయుధాలు ఇప్పటికే ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లకు మద్దతుగా వినియోగించామని కెయిన్ వెల్లడించినట్టుగా ది వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. ఇరాన్ ప్రతీకార దాడులు చేపడితే వాటిని అదుపులో పెట్టడం కష్టమవుతుందని ఆయన హెచ్చరించినట్టు పేర్కొంది. యుద్ధం దీర్ఘకాలంగా కొనసాగి, అమెరికా సైనికుల ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసినట్టు వివరించింది. కాగా యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ గత కొద్ది వారాలుగా ఈ సమావేశాలకు హాజరు కాలేదని మరో వార్త కథనం వెల్లడించింది. ఈ మీడియా నివేదికలపై ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో సుదీర్ఘమైన పోస్ట్‌లో స్పందించారు.

## ఉగ్రవాద పోరులో అండగా ఉంటాం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉగ్రవాద పోరులో అండగా ఉంటామనీ, ఇజ్రాయిల్‌పై 2023 అక్టోబర్‌లో హమాస్ చేసిన దాడిని ప్రధాని మోడీ ఖండించారు. హమాస్ దాడిని అనాగరిక చర్యగా విమర్శించారు. ఇజ్రాయిల్‌కు అండగా ఉంటామని చెప్పారు. రెండురోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఆ దేశ పార్లమెంట్‌లో మోడీ ప్రసంగించారు. హమాస్ దాడి గురించి మాట్లాడుతూ? "మీ బాధను మేం అనుభవిస్తున్నాం. మీ బాధను పంచుకుంటాం. ప్రస్తుతం, భవిష్యత్‌లో కూడా ఇజ్రాయిల్‌పై పూర్తి నమ్మకంతో ధృఢంగా భారత్ నిలుస్తుంది" అని మోడీ చెప్పారు. ప్రజలను చంపడాన్ని, ఉగ్రవాదాన్ని ఏ కారణమూ సమర్థించదని అన్నారు. "భారత్ కూడా ఉగ్రవాద బాధను భరించింది. 26/11 ముంబయి దాడుల్లో ఇజ్రాయిల్ పౌరులతో సహా అనేక మంది అమాయక ప్రజల ప్రాణాలను కోల్పోయిన సంఘటనలను మేం ఎల్లప్పుడు గుర్తుంచుకుంటాం. ఉగ్రవాదంపై సహనం లేని, రాజీలేని విధానాన్ని మేం కలిగి ఉన్నాం. ఇందులో ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలూ లేవు" అని మోడీ తెలిపారు. శాంతి మార్గం ఎల్లప్పుడూ సులభం కాదని, కానీ ఈ ప్రాంతంలో చర్చలు, శాంతి, స్థిరత్వం కోసం ఇజ్రాయిల్‌తో ప్రపంచంతో పాటు భారత్ కలిసి ఉంటుందని మోడీ చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతికి యూఎన్ భద్రతా మండలి ఆమోదించిన గాజా శాంతి ఒప్పందం ఒక మార్గాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. భారత్‌లో యూదు ప్రజలు ఎలాంటి హింస, వివక్ష లేకుండా జీవిస్తున్నారని చెప్పారు. "భారత్‌లో యూదులు తమ విశ్వాసాలను కాపాడుకు న్నారు. సమాజంలో పూర్తిగా కలిసిపోయారు" అని మోడీ తెలిపారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో భారత్, ఇజ్రాయిల్ వంటి విశ్వసనీయ భాగస్వాముల మధ్య బలమైన రక్షణ భాగస్వామ్యం చాలా ముఖ్యమని కూడా మోడీ తెలిపారు. త్వరలోనే భారత్ ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందనీ, మరోవైపు ఇజ్రాయిల్ ఆవిష్కరణ, సాంకేతిక రంగాలల్లో శక్తివంతమైన దేశమని చెప్పారు.

# ఉద్యోగాన్ని త్యజించి ధర్మప్రచారానికి అంకితమైన జీవితం

**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల జిల్లాకు ఆధ్యాత్మిక కాంతి పుంజంగా నిలిచిన మందపల్లి పరాంకుశాచార్య స్వామి (పాపాచార్యులు) శతాధిక వయస్సులో పరమపదించిన వార్త భక్తజన సమాజాన్ని విషాదంలో ముంచెత్తింది. వంద మూడేళ్ల దీర్ఘాయుష్షును అనుభవించి, చివరి శ్వాస వరకు సాంప్రదాయ ధర్మ ప్రచారాన్ని జీవిత ధ్యేయంగా నిలబెట్టుకున్న ఈ మహనీయుని జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయక గాథగా నిలిచి పోతుంది. లక్షెట్టిపేట వాస్తవ్యులైన ఆయన దాదాపు ఎనభై అయిదేళ్లకు పైగా గ్రామంలోని జగన్నాథాచార్యుల ఆలయంలో వంశపారంపర్య అర్చకుడిగా సేవలందించి, ఆలయ పరంపరను కాపాడిన కర్తవ్య నిరతుడిగా ఖ్యాతి గడించారు. వేయికి పైగా భాగవత సప్తాహాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి, పౌరాణిక ధర్మ ప్రచారంలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు. ప్రమోదూత నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ చతుర్దశి నాడు 1929లో జగిత్యాల జిల్లాలో జన్మించిన పరాంకుశాచార్యుల తల్లి రాధమ్మ, తండ్రి మందపల్లి రామాచార్యులు. తండ్రి రెవిన్యూ శాఖలో ఉద్యోగిగా ఉన్నప్పటికీ సంప్రదాయ నిష్ఠను కాపాడిన వారు. తాతగారు మందపల్లి పాపయ్య తహసీల్దారు హోదాలో ఉన్నప్పటికీ ధర్మాచరణలో ఆదర్శంగా నిలిచారు. మాతామహులు నంబి సీతారామాచార్యులు సాంప్రదాయ పాండిత్య సంపత్తితో ప్రసిద్ధి గాంచారు. ఈ విధంగా కుటుంబ వాతావరణమే పరాంకుశాచార్యుల వారిలో ధర్మనిష్ఠను, వేదాంతాసక్తిని పెంపొందించింది. బాల్యం లోనే అసాధారణ మేధస్సుతో అమర కోశాన్ని కంఠస్థం చేయడం ఆయన విద్యా ప్రస్థానానికి బలమైన పునాది. కోరుట్ల లోని సేనాపతి సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించి, తొలి శతావధాని శిరీశిహల్ కృష్ణమాచార్యుల వద్ద రామశబ్దం నుండి శ్రీభాష్యాంతం వరకు సంస్కృత సాహిత్యాన్ని, ఉభయ వేదాంత గ్రంథాలను అధీతి చేశారు. గురుపరంపరపై ఉన్న భక్తి, శాస్త్రాధ్యయనంలో ఉన్న శ్రద్ధ ఆయనను ప్రగాఢ పాండిత్యంతో తీర్చిదిద్దాయి. కేవలం పాఠ్యాంశ పరిధిలోనే కాకుండా పురాణ, ఇతిహాస, ఆళ్వారు ప్రబంధాలపై కూడా సమగ్ర పట్టు సాధించారు. చిన్ననాటి నుంచే హిందీ విద్యను అభ్యసించి 1945లో హిందీ విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అయితే తండ్రి ఆజ్ఞానుసారం ఉద్యోగ జీవితం వైపు మళ్లక, సంప్రదాయ ధర్మ ప్రచారాన్ని జీవన వ్రతంగా స్వీకరించారు. ఈ నిర్ణయం ఆయన జీవితాన్ని సాధారణ గృహస్థుని స్థాయి నుండి ఆధ్యాత్మిక గురువుగా ఎదగడానికి మార్గం చూపింది. పంచ సంస్కార గురువుగా కోరుట్లకు చెందిన శ్రీ ఉ.వే.ప్ర. రాజయోగి సేనాపతి నృసింహాచార్యుల వారి సన్నిధిలో సంస్కార దీక్ష పొందడం ఆయన జీవితంలో కీలక ఘట్టం. మోర్తాడుకు చెందిన లక్ష్మమ్మతో పన్నెండేళ్ల వయసులోనే వివాహం జరిగినప్పటికీ గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటిస్తూ, ఆధ్యాత్మిక సేవను సమన్వయ పరిచారు. కుటుంబంగా ఇద్దరు కుమారులు?శ్రీ రామమూర్తి, జగన్నాథాచార్యులు... ఇద్దరు కుమార్తెలు ఆండాళు, పద్మ. పెద్ద కుమారుడు రామమూర్తి ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగం చేసి విరమణ పొందారు. వయోభారంతో చివరి కాలంలో హైదరాబాద్‌లో కుమారుడి వద్ద నివసించినప్పటికీ, ధర్మ చింతన, జప తపాలు, పఠన ప్రవచనాలు ఆయన దినచర్యలో అంతర్భాగంగా ఉండేవి. పరాంకుశాచార్యుల వారి ఖ్యాతికి మూలకారణం ఆయన నిర్వహించిన భాగవత సప్తాహాలే. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో భాగవత సప్తాహాలు నిర్వహించి భక్తులను భగవద్భక్తి మార్గంలో నడిపించారు. శ్రీమద్రామాయణం, మహాభారతం వంటి మహా గ్రంథాలపై సుమారు ఇరవై సార్లు కాలక్షేపాలు నిర్వహించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. తిరుమంత్రార్థం, తిరుప్పావు, శ్రీవచనభూషణం వంటి విశిష్టాద్వైత సాంప్రదాయ గ్రంథాలపై ప్రవచనాలు చేసి ఉభయ వేదాంత పాండిత్యాన్ని ప్రతిభావంతంగా చాటారు. ఆయన శ్రావ్యకంఠం, సులభ వ్యాఖ్యాన శైలి, ఉదాహరణలతో కూడిన వివరణ ప్రజలను ఆకట్టుకునేవి. భక్తి నివేదనలో భాగంగా శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామివారి మంగళా శాసనాలు అందుకోవడం ఆయన ఆధ్యాత్మిక సేవకు లభించిన విశిష్ట గౌరవం. రాష్ట్రీయ సంస్కృత సంస్థానం లోనూ ఆయనకు ఉభయ వేదాంత పండిత భృతి లభించడం ఆయన పాండిత్యానికి గుర్తింపు. సుమారు ముప్పై ఆరు సంవత్సరాలు ప్రతి వత్సరం ఆర్థిక సాయం అందుకోవడం ఆయన శాస్త్ర సేవకు ప్రభుత్వ స్థాయి మన్ననగా నిలిచింది. లక్షెట్టిపేటలో నలభై ఏళ్లకు పైగా నివసించి ఆ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా నిలిచారు. జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో ఆయన పేరు భాగవత పండితునిగా మార్మోగేది. ధనుర్మాసంలో తిరుప్పావు కాలక్షేపాలు నిర్వహించడం, వేణుగోపాల స్వామి సన్నిధిలో దివ్యప్రబంధ పఠనం చేయడం ఆయన దినచర్యలో భాగం. తి.తి.దే. ఆధ్వర్యంలోని ఆళ్వారు ప్రబంధ ప్రాజెక్టులో పాల్గొని దివ్యప్రబంధాల ప్రచారం చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనం. అనారోగ్యానికి లోనుకాకుండా దీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితం గడపడం ఆయన నియమ నిష్ఠలకు ప్రతిఫలం. వయోభారంతో స్వల్ప అస్వస్థత ఏర్పడటంతో ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేక పరమ పదించారు. స్వగ్రామంలోనే అంత్యక్రియలు జరగాలన్న ఆయన కోరిక మేరకు లక్షెట్టిపేట గోదావరి తీరాన సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు, శిష్యులు, ధర్మపురి పండితులు, స్థానిక బ్రాహ్మణులు, గ్రామస్తులు అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి నివాళులు అర్పించారు. పరాంకుశాచార్యుల జీవితం ఒక వ్యక్తి సాధన

ఎంత దూరం తీసుకెళ్లగలదో చూపిన సజీవ సాక్ష్యం. ఉద్యోగావకాశాలను త్యజించి సంప్రదాయ ప్రచారాన్ని ఎంచుకోవడం, కుటుంబ బాధ్యతల మధ్య ధర్మసేవను సమన్వయ పరచడం, శాస్త్ర పాండిత్యాన్ని ప్రజలందరికీ అందుబాటులో ఉంచడం?ఇవి అన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని విశిష్టంగా నిలబెట్టాయి. భాగవత సప్తాహాల ద్వారా భక్తుల్లో నైతిక విలువలను, భగవద్భక్తిని, సత్సంస్కారాలను నాటిన ఆచార్యులవారు కేవలం ప్రవచనకర్త మాత్రమే కాదు; జీవనోపాధ్యాయుడు. ఆయన కంఠస్థ జ్ఞానం, ప్రవచన నైపుణ్యం, గురుపరంపరపై భక్తి, శిష్యులపై ప్రేమ? కలసి ఒక సంపూర్ణ ఆచార్య స్వరూపాన్ని నిర్మించాయి. సమాజంలో మారుతున్న విలువల మధ్య సంప్రదాయాన్ని కాపాడే ధృఢచిత్తంతో జీవించిన ఆయన, ఆచార్య పరంపరలో అరుదైన రత్నంగా నిలిచారు. శతాధిక వయస్సు దాటినా ధర్మప్రచారం ఆపకుండా కొనసాగించడం ఆయన ఆత్మబలాన్ని తెలియ జేస్తుంది. నేటి తరానికి పరాంకుశాచార్యుల వారి జీవితం ఒక సందేశం సంస్కృత విద్య, వేదాంత పాండిత్యం, సంప్రదాయ నిష్ఠలు కేవలం గతకాలపు ఆస్తులు కావు;

అవి సమాజాన్ని సుస్థిరంగా నిలబెట్టే మూల స్తంభాలు. గ్రామీణ వాతావరణంలో జన్మించి రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి గడించిన ఆయన సాధన స్ఫూర్తిదాయకం. శాస్త్రసేవ, భక్తిప్రచారం, గురుభక్తి, నియమనిష్ఠలు కలసి ఒక మహనీయుని నిర్మిస్తాయని ఆయన జీవితం స్పష్టం చేస్తుంది. మందపల్లి పరాంకుశాచార్యస్వామి వారి పరమపదం ఒక యుగాంతరంలా అనిపించినా, ఆయన బోధనలు, ప్రవచనాలు, శిష్యపరంపర రూపంలో ఆధ్యాత్మిక వారసత్వం కొనసాగుతూనే ఉంటుంది. లక్షెట్టిపేట గోదావరి తీరంలో ఆయనకు నిర్వహించిన అంత్యక్రియలు కేవలం ఒక మహనీయునికి వీడ్కోలు మాత్రమే కాదు; ఒక సంప్రదాయ యుగానికి గౌరవనివాళి. ఆయన జీవితం భక్తి, పాండిత్యం, సేవ అనే త్రివేణి సంగమంగా నిలిచి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

## మాజీ సీఎం మనవడు హఠాన్మరణం.. షాకింగ్ విషయం చెప్పిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రం మనాలీలో జార్ఖండ్ మాజీ సీఎం, బీజేపీ నేత చంపై సోరెన్ మనవడు వీర్ సోరెన్ (19) మృతిచెందారు. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఆయన, అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడం సంచలనం రేపుతోంది. పానిపట్‌లోని యూనివర్సిటీలో చదువుతున్న వీర్ సోరెన్, తన ఐదుగురు స్నేహితులతో కలిసి విహారయాత్ర కోసం మనాలీ వెళ్లారు. అక్కడ సిమ్సా ప్రాంతంలోని ఒక హోమ్‌స్టేలో వీరు బస చేశారు. ఫిబ్రవరి 23 రాత్రి వీర్ సోరెన్ తీవ్రమైన తలనొప్పితో బాధపడ్డారు. స్నేహితులు ఆన్‌లైన్‌లో మందులు ఆర్డర్ చేసి ఇవ్వగా, అవి వేసుకుని ఆయన నిద్రపోయారు. మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో గదిలో ఏదో పడిపోయిన శబ్దం రావడంతో స్నేహితులు వెళ్లి చూడగా, వీర్ సోరెన్ మంచం పక్కన కింద పడి ఉన్నారు. నోటి నుంచి నురగలు వస్తుండటాన్ని గమనించిన స్నేహితులు వెంటనే ఆయనను మనాలీ సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు సీపీఆర్ చేసి కాపాడటానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రాథమిక విచారణలో వీర్ సోరెన్ శరీరంపై ఎటువంటి గాయాలు లేవని పోలీసులు తెలిపారు. ఎత్తైన ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఆక్సిజన్ స్థాయి తగ్గి వచ్చే



'ఆల్టిట్యూడ్ సిక్‌నెస్' వల్ల ఈ మరణం సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలపడంతో భౌతికకాయాన్ని వారికి అప్పగించారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ ఘటనపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఏకంగా మహిళా మంత్రిపై దాడి.. ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేరళ: కేరళ ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వీణా జార్జ్‌పై జరిగిన దాడి ఘటనలో కన్నూర్ టౌన్ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం కేరళ స్టూడెంట్స్ యూనియన్ (ఖూజ)కు చెందిన ఐదుగురు నేతలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం కన్నూర్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు వెళ్తున్న మంత్రిని కేఎస్‌యూ కార్యకర్తలు అడ్డుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న వైద్య నిర్లక్ష్య ఘటనలపై నిరసిస్తూ వారు నల్లజెండాలతో ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మంత్రి వీణా జార్జ్‌కు మెడ భాగంతో పాటు చేతికి గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె కన్నూర్ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు.



ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఐదుగురు ప్రధాన నిందితులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో కేఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎంసీ అతుల్, జిల్లా ట్రెజరర్ అక్షయ్ మట్టూల్, సీహెచ్ ముబాజ్, బితుల్ బాలన్, మహమ్మద్ యాసిన్ ఉన్నారు. ఈ ఘటనను సీఎం పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్య నిరసన కాదని, ఒక మహిళా మంత్రిపై జరిగిన క్రూరమైన దాడి అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు.
మంత్రి చుట్టూ 30 మందికి పైగా పోలీసులు ఉన్నారని, విద్యార్థులు ఆమె దగ్గరకు కూడా వెళ్లలేదని వారు వాదిస్తున్నారు. ఇది కేవలం సానుభూతి కోసం ఆడుతున్న రాజకీయ డ్రామా అని విమర్శించారు.

### ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన ఇరాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** టెహ్రాన్ అమెరికాను ఢీకొట్టగల క్షిపణిలను అభివృద్ధి చేస్తోందని తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు పచ్చి అబుద్ధాలని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ తోసిపుచ్చింది. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, జనవరిలో దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో చనిపోయిన వారి సంఖ్య గురించి వారు ఏమి ఆరోపిస్తున్నారో అదంతా కేవలం పచ్చి అబద్ధాలు. ఆ పెద్ద అబద్దాలనే పదే పదే పునరావృతం చేయడమే పని' అని ట్రంప్‌నుద్దేశించి ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఖై ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, ట్రంప్ ఇరాన్ క్షిపణులు అమెరికా గడ్డను తాకబోతున్నాయని, ఈ చర్యను ఎప్పటికీ అనుమతించనని అని ట్రంప్ తాజాగా స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఎస్మాయిల్ బకై ఎక్స్ పోస్టులో తీవ్రంగా ఆరోపించారు. ఇరాన్ అణ్వాయుధాలను నిర్మించడానికి తాను ఎప్పటికీ అనుమతించనని ట్రంప్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

### ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అక్రమ వలసదారుల ను ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది. ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి బ్రియాన్ మర్ఫీ ఈ మేరకు తీర్పునిచ్చారు. అధికారం చేపట్టినప్పటి నుంచి అక్రమ వలసదారులపై ట్రంప్ కొరడా ఝుళిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వలసదారులను యూఎస్ నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. తరలింపు ఎదుర్కొంటున్న వలసదారులు దీనిపై కోర్టులో దావా వేయగా, తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా.. అక్రమ వలసదారులకు ముందస్తు నోటీసులు, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్టవిరుద్ధమని తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల పాటు సమయం ఇచ్చింది.

## మా హెచ్చరికలు సీరియస్‌గా తీసుకోండి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్– అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాకు యుద్ధనౌకలను పంపుతూ టెహ్రాన్‌పై అగ్రరాజ్యం బెదిరింపులకు పాల్పడుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. సైనిక చర్యకు సంబంధించి తమ బెదిరింపులను ఇరాన్ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. వాన్స్ ఫ్యాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ.. చెత్త పాలకుల చేతుల్లో అణ్వాయుధాలు ఉండటం సరికాదంటూ ఇరాన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దౌత్య చర్చలను అమెరికా బలహీనతగా చూడొద్దంటూ హెచ్చరించారు. తమ అధ్యక్షుడు ట్రంప్ దౌత్యపరమైన మార్గాలనే ఇష్టపడతారంటూనే.. ఆయన వద్ద మరిన్ని ఎంపికలు కూడా ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. వాటిని చేపట్టేందుకు ట్రంప్ సుముఖత చూపడం లేదని.. ఇరానియన్లు తమ హెచ్చరికలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. టెహ్రాన్‌తో మంచి ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని వాన్స్ అభిప్రాయపడ్డారు. ఇక, అణు ఒప్పందానికి సంబంధించి ఇరాన్– అమెరికా మధ్య ఇప్పటికే రెండు రౌండ్లు చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గురువారం జెనీవాలో ఇరుదేశాలు మరోమారు చర్చలకు సిద్ధమయ్యాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ.. తన బృందంతో కలిసి ఇప్పటికే జెనీవాకు చేరుకున్నారు. అక్కడ ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేతృత్వంలోని అధికారులతో చర్చలు జరపనున్నారు.

## టీసీఎస్ ఏఐకి భయపడదు




దేశీయ ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కృత్రిమ మేధస్సు (ఏఐ)కి భయపడదని కంపెనీ సీఈఓ కె కృతివాసన్ అన్నారు. కంపెనీ వార్షిక సమావేశంలో మాట్లాడిన ఆయన.. ఏఐ కారణంగా టీసీఎస్ ప్రస్తుత ఆదాయంలో కొంత తగ్గినప్పటికీ ఏఐ టూల్స్ ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఐ కారణంగా జరిగే మార్పుల కోసం సిద్ధంగా ఉన్నామని, కంపెనీ విధానాల్లోనూ మార్పు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టులలో ఏఐని ఉపయోగించమని ఉద్యోగులకు చెబుతున్నాం, దీనివల్ల కంపెనీకి స్వల్పకాలంలో ఆదాయం తగ్గినా సరే ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కంపెనీలో మొత్తం 6 లక్షలకు పైగా ఉద్యోగులు ఉన్నారు. వారంతా ఏఐ స్కిల్స్ కలిగి ఉండాలని ఆశిస్తున్నాం. యువ ఉద్యోగులతో పోలిస్తే, సీనియర్లు ఏఐని అలవర్చుకోవడం వెనుకబడ్డారని గుర్తించాం. కొత్త టెక్నాలజీ విషయంలో ఉద్యోగాలు పోతాయనే చర్చకు భయపడట్లేదు, దీన్ని అధిగమించేందుకు ఉద్యోగులు కూడా కొంత కష్ట పడాలని కోరుకుంటున్నామని వివరించారు. ఏఐని ఉపయోగించడం అంటే ఓపెన్‌ఏఈకి చెందిన చాట్‌జీపీటీ లాంటి ప్లాట్‌ఫామ్‌లకు సాధారణ ప్రాంప్ట్‌లను ఇవ్వడం మాత్రమే కాదు, దాంతో ఉపయోగపడే పరిష్కారాలను సాధించడం కూడా అని ఆయన పేర్కొన్నారు.

## తగ్గిన బంగారం ధరలు



ఇటీవల కాలంలో బంగారం ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరో రోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఈ ఫిబ్రవరి నెల నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో గోల్డ్ ప్రియులు ధరలు తగ్గుతాయేమో అని ఎదురుచూశారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఇవాళ(ఫిబ్రవరి 26) హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల కనిపిస్తుంది. 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర పై రూ.210 తగ్గి రూ.1,61,680గా ఉంది. ఇక ఆభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర పై రూ.200 పతనమై రూ.1,48,200కు చేరింది. ఇక వెండి (రాతిశ్రీలవతీ) ధరలు నిన్నటి ధరలతో పోల్చితే స్థిరంగా ఉన్నాయి. కిలో వెండి ధర నేడు(గురువారం) రూ.2,95,000 వద్ద కొనసాగుతోంది.

## మనీలాండరింగ్ కేసులో అనిల్ అంబానీ రూ. 3,716 కోట్ల ముంబై ఇల్లు అటాచ్



రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీకి సంబంధించి మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఆయన నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. ముంబైలోని పాల్‌హిల్ ప్రాంతంలో ఉన్న రూ.3,716.83 కోట్ల విలువైన 17 అంతస్తుల నివాసం 'అబోడ్'ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జప్తు చేసినట్టు అధికారులు వెల్లడించారు. దీంతో ఈ కేసులో అటాచ్ చేసిన ఆస్తుల మొత్తం విలువ దాదాపు రూ.15,700 కోట్లకు పెరిగింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ కంపెనీలు రూ. 40 వేల కోట్లకుపైన బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా జరిగిన జప్తు రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్)తో సంబంధం ఉన్న కేసులో భాగంగా జరిగింది. కాగా, నేడు(ఫిబ్రవరి 26) అనిల్ అంబానీ మరోసారి ఢిల్లీలో ఈడీ విచారణకు హాజరు కానున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆయనకు ఈడీ సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసు కింద అనిల్ అంబానీ స్టేట్‌మెంట్ నమోదు చేసేందుకు 2025, ఆగస్టులో ఆయన మొదటిసారిగా ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు.

## ఏపీలో రూ.1200 కోట్లతో క్లీన్ మాక్స్ సోలార్ పార్క్



ఏపీలో రూ.1200 కోట్లతో 200 మెగావాట్ల సోలార్ పార్క్ అభివృద్ధి చేయడానికి క్లీన్ మాక్స్ ఎనర్జీ సంస్థ ముందుకు వచ్చింది. అయితే ఈ ప్రాజెక్ట్ ఖచ్చితమైన స్థలం ఇంకా ప్రకటించకపోయినా, సొంత నిర్మాణం, నిర్వహణ పద్ధతిలో(బూ) ఈ పార్క్ ను అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. కాగా ప్రాజెక్ట్ పూర్తయ్యాక ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ప్రధానంగా కమర్షియల్ మరియు ఇండస్ట్రియల్(అడఎ) వినియోగదారులకు దీర్ఘకాలిక పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల ద్వారా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం క్లీన్ మాక్స్ దాదాపు 1.5 గిగావాట్ల ఆపరేషనల్ రిన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యాన్ని(సోలార్ + విండ్) కలిగి ఉండగా.. 2027 నాటికి 3 గిగావాట్లకు చేరుకోవడమే సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇక ఈ కొత్త ప్రాజెక్ట్ 18 నుండి 24 నెలల్లో దశలవారీగా పూర్తి చేయనున్నారు. భారతదేశంలో రూఫ్‌టాప్, గ్రౌండ్-మౌంట్ సోలార్ రంగంలో టాప్ ఉన్న క్లీన్ మాక్స్.. గూగుల్, అమెజాన, మైక్రోసాఫ్ట్, వాల్ మార్ట్ వంటి గ్లోబల్ దిగ్గజాలకు గ్రీన్ పవర్ సరఫరా చేస్తోంది. కాగా త్వరలోనే ఈ సంస్థ ఎఖూ కి వెళ్లనుంది. ఏపీలో పెట్టుబడి పెట్టనున్న రూ.1,200 కోట్ల భారీ పెట్టుబడి భారత భవిష్యత్తు సోలార్ రంగంపై సంస్థకు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోంది. ఎఖూకువెళ్లక ముందే సంస్థ విస్తరణను చేపట్టడం ద్వారా పెట్టుబడిదారుల ముందు బలమైన గ్రోత్ స్టోరీని ప్రదర్శించాలనే వ్యూహంతో క్లీన్ మాక్స్ ముందుకు సాగుతోంది. మొత్తంగా చూసినట్లయితే.. క్లీన్ మాక్స్ సోలార్ ప్రాజెక్ట్ సంస్థ పబ్లిక్ ఇష్యూ ప్రక్రియకు ఒక ముఖ్యమైన బూస్ట్‌గా నిలిచే అవకాశముంది.

# ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఫ్రాడ్ వ్యవహారంలో మాజీ మేనేజరే కీలక సూత్రధారి




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో జరిగిన రూ. 590 కోట్ల భారీ మోసంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బ్యాంకు చండీగఢ్ బ్రాంచ్‌లో జరిగిన ఈ ఫ్రాడ్ వెనుక మాజీ బ్రాంచ్ మేనేజర్ హస్తం ఉందని, హర్యానా ప్రభుత్వ విభాగాల ఖాతాల నుంచి నిధులు మాజీ మేనేజర్ భార్య, బావమరిది నడుపుతున్న కంపెనీకి చెందిన ఖాతాలోకి మళ్లించారనేగ్ర్భ్భాంతికరమైన వివరాలు దర్యాప్తులో తేలాయి. హర్యానా అవినీతి నిరోధక విభాగం ఈ కేసులో ఇప్పటివరకు మాజీ బ్రాంచ్ మేనేజర్ రిభవ్ రిషి, బ్యాంకు మాజీ రిలేషన్‌షిప్ మేనేజర్ అభయ్, రిభవ్ భార్య స్వాతి సింగ్లా, ఆమె సోదరుడు అభిషేక్ సింగ్లాలను అరెస్టు చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు మాజీ మేనేజరే సూత్రధారి అని అధికారులు గుర్తించారు. బ్యాంకు కార్యకలాపాల్లో అవకతవకలు సృష్టించి ప్రభుత్వ నిధులను అతడు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు స్పష్టమైంది. అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్ జనరల్ ఎఎస్ చావ్లా మాట్లాడుతూ.. రిభవ్, అభయ్ ఈ కేసులో ప్రధాన నిందితులు. వారిద్దరూ ఆరు నెలల క్రితమే ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు నుంచి తమ ఉద్యోగాలను వీడారని చెప్పారు. రిభవ్ రిషి ప్రస్తుతం ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. 2025, సెప్టెంబర్‌లో హర్యానా ముఖ్యమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన పథకానికి సంబంధించిన నిధుల జమ కోసం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుతో పాటు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఆ రాష్ట్ర అధికారులు రెండు అకౌంట్లు తెరిచారు. మొదట్లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులు రూ. 50 కోట్లను, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో రూ. 25 కోట్లు డిపాజిట్ చేశారు. ఆ తర్వాతే బ్రాంచ్ మేనేజర్‌గా ఉన్న రిభవ్ రిషి, రిలేషన్‌షిప్ మేనేజర్ అభయ్, హర్యానా ప్రభుత్వ శాఖ ఖాతాలను దుర్వినియోగం చేశారు. అనధికార లావాదేవీలు నిర్వహించి, సరైన అనుమతి లేకుండా రికార్డులను తారుమారు చేశారు. పెద్ద మొత్తంలో అంటే దాదాపు రూ. 300 కోట్లు ప్రభుత్వానికి చెందినన ఖాతాల నుంచి వీరు స్వస్తిక్ దేశ్ ప్రాజెక్ట్స్ అనే ప్రైవేట్ కంపెనీకి బదిలీ చేశారు. ఈ కంపెనీ రిభవ్ భార్య, ఆమె సోదరుడికి చెందినదని సమాచారం. అక్కడి నుంచి, డబ్బును ఇతర షెల్ కంపెనీలకు తరలించారు. దీనివల్లే ఈ ఫ్రాడ్‌ను వెంటనే గుర్తించడం కష్టమైంది. అయితే, ప్రభుత్వ పథకానికి సంబంధించిన నిధుల వినియోగంపై హర్యానా రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ బ్యాంకుల్లోని అకౌంట్లను క్లోజ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ఖాతాల్లోని సొమ్మును వడ్డీతో కలిపి బదిలీ చేయాలని బ్యాంకులకు లేఖలు పంపారు. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు అకౌంట్లోని సొమ్మును హర్యానా ప్రభుత్వానికి బదిలీ చేసి, ఆ అకౌంట్‌ను క్లోజ్ చేశారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాత్రం ప్రక్రియను ఆలస్యం చేసింది. దీనిపై బ్యాంకు నుంచి సరైన స్పందన లేకపోవడం విచారణ కమిటీ వేయగా, వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నిందితులు సొమ్మునంతా షెల్ కంపెనీలకు ట్రాన్స్‌ఫర్ చేశారని తేలింది. బ్యాంకులో జరిగిన నిర్వహణా లోపాలతో అనుమానం ఉన్న లావాదేవీలను పరిశీలించడంతో, ప్రభుత్వ అకౌంట్లలోని మొత్తం రూ. 590 కోట్ల వరకు నిధులను దారి మళ్లించారనే విషయం బయటపడింది.

# మారని ట్రంప్ తీరు.. సోలార్ ప్యానెల్స్‌పై 126 శాతం టారిఫ్



ఇటీవలే ఇండియా-యూఎస్ మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని గురించి ఇరుదేశాలు అధికారిక ప్రకటన కూడా చేశాయి. అయితే, భారత్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు మాత్రం మారడంలేదు.తాజాగా మరోసారి భారీ టారిఫ్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. భారత్ నుంచి అమెరికాకు వెళ్లే సోలార్ ఉత్పత్తులపై ప్రాథమికంగా 126 శాతం దిగుమతి సుంకాల్ని విధిస్తున్నట్లు వెల్లడించారు. ఫారెన్ సబ్సిడీల ఆధారంగా ఈ స్థాయి రేటు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయంలో భారత్ సోలార్ తయారీ రంగంలో అన్యాయమైన పద్ధతిలో సబ్సిడీలు ఇస్తోందని, దీనివల్ల అమెరికా స్థానిక తయారీదారులు నష్టపోతున్నారని అమెరికా వాణిజ్య విభాగం చెబుతోంది. సులభంగా చెప్పాలంటే, భారత్ నుంచి వెళ్లే సోలార్ ప్యానెల్స్ ధరలు, అమెరికాలో కంటే తక్కువగా ఉన్నాయని అర్థం. అందుకే అమెరికా భారత సోలార్ ప్యానెల్స్‌పై భారీ టారిఫ్ విధించింది. మనదేశంతో పాటు మరో రెండు దేశాలపైనా ట్రంప్ టారిఫ్ విధించారు. ఇండోనేసియా సోలార్ ఉత్పత్తులపై 143 శాతం, లావోస్‌పై 81 శాతానికి దిగుమతి సుంకాల్ని పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనతో అమెరికాకు సోలార్ ఉత్పత్తుల్ని ఎగుమతి చేసే మన కంపెనీలపై తీవ్ర ప్రభావం పడింది. దీనివల్ల బుధవారం స్టాక్ మార్కెట్లలో సోలార్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. ముఖ్యంగా వారీ ఎనర్జీస్ 11 శాతం, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, విక్రమ్ సోలార్ లిమిటెడ్ ఒక్కోటి 6 శాతం, సోలెక్స్ ఎనర్జీ లిమిటెడ్ 8 శాతం, వెబ్‌సోల్ ఎనర్జీ సిస్టమ్ లిమిటెడ్ 7 శాతం మేర క్షీణించాయి.

# రూ.2.7 లక్షల కోట్ల స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు

గతేడాది మనదేశం నుంచి 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.7 లక్షల కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం పేర్కొన్నారు. 'ప్రపంచానికి స్మార్ట్‌ఫోన్ తయారీ కేంద్రంగా భారత్ ఎదుగుతోంది' అని సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్ట్ చేశారు. గతేడాది మనదేశం నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యింది కూడా స్మార్ట్‌ఫోన్లేనని తెలిపారు. 2025లో మన దేశంలో రూ.5.5 లక్షల కోట్ల (60 బి.డాలర్ల) విలువైన మొబైల్ ఫోన్లు ఉత్పత్తి అయ్యాయి. 2024-25లో ఈ విభాగ ఎగుమతులు దాదాపు రూ.2 లక్షల కోట్లు (22 బి.డాలర్లు)గా ఉన్నాయి. గత ఏడాదిలో దేశం నుంచి మొత్తం ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు (44 బి.డాలర్లు) మించాయి. ఈ ఏడాది 4 సెమీకండక్టర్ ప్లాంట్లలో ఉత్పత్తి ప్రారంభమైతే, ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది. చైనా-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాక.. అమెరికా దిగ్గజ సంస్థ యాపిల్, భారత్‌లో తయారీని విస్తరించిందని, ఫలితంగా మన దేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు రికార్డు స్థాయికి చేరాయని కౌంటర్‌పాయింట్ సహవ్యవస్థాపకుడు, ఉపాధ్యక్షుడు నీల్ షా పేర్కొన్నారు. 2025లో మన దేశంలో తయారైన ప్రతి నాలుగు స్మార్ట్‌ఫోన్లలో ఒకటి ఎగుమతి అయిందని అన్నారు.

# షార్ట్ వీడియోలు ఎక్కువగా చూస్తున్నారా? మీ మెదడుపై ఎలాంటి ప్రభావం పడుతుందో తెలుసా..



మనం ఖాళీ సమయం దొరికితే చాలు ఫోన్ తీసి ౹ఱఅనిశీని, ×అర్ఘుస్త్రతీఘఎ =వవశ్రీం లేదా్‌శీబుబఎవ ౹ాష్ట్రశీతీం చూస్తూ గంటలు గంటలు గడిపేస్తుంటాం. అయితే, ఇలాంటి షార్ట్ వీడియోలు ఎక్కువగా చూడటం వల్ల మన మెదడుపై ఎలాంటి ప్రభావం పడుతుందో చైనా పరిశోధకులు ఒక కొత్త అధ్యయనంలో వెల్లడించారు.

**మెదడుపై పరిశోధన:**

పరిశోధకులు కొంతమంది యువకుల మెదడు తరంగాలను పరిశీలించి కొన్ని విషయాలను గుర్తించారు. షార్ట్ వీడియోలు చూడటం అలవాటు పడిన వారి మెదడులో దృష్టిని కేంద్రీకరించే భాగాలు నెమ్మదిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఏదైనా పని మీద దృష్టి పెట్టి చేయాలన్నా లేదా దృష్టిని మళ్ళీ పని మీదకు మళ్ళించాలన్నా మెదడు చాలా ఇబ్బంది పడుతోంది. వీడియోలు చూస్తూ ఆపలేకపోవడం వల్ల మెదడులో సెల్ఫ్ కంట్రోల్ శక్తి తగ్గుతోంది. పరిశోధన ప్రకారం ఇవన్నీ పూర్తిగా ప్రమాదం అని చెప్పలేం. కానీ షార్ట్ వీడియోలు చూడటం వల్లే ఫోకస్ తగ్గిందా ? లేక ఫోకస్ తక్కువగా ఉన్నవారే ఇలాంటి వీడియోలకు ఆకర్షితులవుతున్నారా ? అనేది ఇంకా పూర్తిస్థాయిలో తేలాల్సి ఉంది. అయితే, గంటల తరబడి ఎం ఆలోచించకుండా వీడియోలు స్క్రోల్ చేయడం వల్ల మెదడు త్వరగా అలసిపోతుంది.

**ఫోకస్ పెరగాలంటే ఏం చేయాలి?:**

మనం సోషల్ మీడియాను పూర్తిగా మానేయక్కర్లేదు, కానీ కొన్ని మార్పులు చేసుకుంటే మంచిది. రోజుకు ఎంతసేపు వీడియోలు చూడాలి అనేదానికి ఒక టైం పెట్టుకోండి. భోజనం చేసేటప్పుడు లేదా నిద్రపోయే ముందు కనీసం ఒక గంట పాటు ఫోన్ దూరంగా పెట్టేయండి. ఏదైనా ముఖ్యమైన పని లేదా చదువు మొదలుపెట్టే ముందు షార్ట్ వీడియోలను చూడకండి. అలా చూస్తే పని మీద మనసు పెట్టడం కష్టమవుతుంది. కేవలం టైమ్ పాస్ కోసం కాకుండా, మీకు ఉపయోగపడే విషయాల కోసం మాత్రమే సోషల్ మీడియాను వాడటానికి ప్రయత్నించండి.

# నిద్రలేమికి ఈ తప్పులే కారణం!



ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడి సంపాదించేది తినడానికే.. తిన్నది డైజెస్ట్ కావాలన్నా.. ఆరోగ్యంగా ఉండాలన్నా శరీరానికి తగినంత విశ్రాంతి అవసరం. ఉరుకుల పరుగుల జీవితంలో పడుకోవడానికి సమయం కేటాయించడం కూడా చాలా మందికి కష్టమైపోతోంది. నిద్ర కరువైతే అనారోగ్య సమస్యలు ఒకదాని వెంట ఒకటి శరీరంపై దాడి చేస్తాయి. రోజంతా కష్టపడి పని చేసి రాత్రి ఇంటికి రాగానే హాయిగా నిద్రపోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ చాలామందికి బెడ్ మీద పడుకోగానే నిద్ర రాదు. స్మార్ట్‌ఫోన్ తీసి రీల్స్ చూడటం లేదా పాత విషయాలను తలుచుకుంటూ గంటల కొద్దీ మేల్కొనే ఉంటారు. దీనివల్ల మరుసటి రోజు పనిలో ఏకాగ్రత దెబ్బతినడమే కాకుండా, చిరాకు, నీరసం ఆవహిస్తాయి. నిద్ర అనేది మన శరీరానికి ఒక రీఛార్జ్ లాంటిది. అది సరిగ్గా లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుంది. అయితే మీ లైఫ్ స్టైల్ లో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో ఒక అంతర్గత గడియారం ఉంటుంది, దానినే 'సిర్కాడియన్ రిథమ్' అంటారు. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, ఉదయాన్నే ఒకే టైమ్‌కి నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మీ శరీరానికి ఎప్పుడు నిద్రపోవాలో ఒక పద్ధతి అలవాటు అవుతుంది. సెలవు రోజుల్లో కూడా ఈ సమయాన్ని మార్చకుండా ఉండటం వల్ల గాఢ నిద్ర పట్టే అవకాశం ఉంటుంది. చాలామంది రాత్రి పూట కూడా కాఫీ లేదా టీ తాగుతుంటారు. వీటిలో ఉండే కెఫిన్ మన మెదడును అలెర్ట్ గా ఉంచుతుంది, దీంతో నిద్ర రాదు. నిద్రపోయే ఆరు గంటల ముందే కెఫిన్ ఉన్న పానీయాలను ఆపేయాలి. అలాగే ఆల్కహాల్ తాగితే నిద్ర వస్తుందని కొందరు భావిస్తారు కానీ, అది నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుంది. గాఢ నిద్రకు ఆటంకం కలిగించి అర్ధరాత్రి మెలకువ వచ్చేలా చేస్తుంది. మనం నిద్రపోయే గది ఎలా ఉందనేది మన నిద్రను ప్రభావితం చేస్తుంది. బెడ్ రూమ్ ఎప్పుడూ శుభ్రంగా, ప్రశాంతంగా ఉండాలి. గది ఉష్ణోగ్రత మీకు అనుకూలంగా ఉండేలా చూసుకోండి. లైట్లు డిమ్ గా ఉంటే శరీరంలో నిద్రను ప్రేరేపించే హార్మోన్లు విడుదలవుతాయి. ముఖ్యంగా పడక గదిని కేవలం నిద్రకు, విశ్రాంతికి మాత్రమే పరిమితం చేయాలి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి వచ్చే 'బ్లూ లైట్' మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీనివల్ల మన మెదడు అది పగలు అని పొరబడి నిద్రను దూరం చేస్తుంది. నిద్రపోయే ఒక గంట ముందు నుంచే గాడ్జెట్లను దూరంగా పెట్టడం అలవాటు చేసుకోండి. రీల్స్ చూడటం ఒక వ్యసనంలా మారి మీ విలువైన నిద్ర సమయాన్ని హరించేస్తుందని గుర్తించాలి. పడుకునే ముందు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. ఒక మంచి పుస్తకం చదవడం, మెలోడీ సంగీతం వినడం లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. అలాగే డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస) లేదా ధ్యానం చేయడం వల్ల మనస్సులోని ఆందోళనలు తొలగిపోయి శరీరం నిద్రకు సిద్ధమవుతుంది.

# ఇప్పపువ్వుతో ఆ జబ్బులన్నీ మాయం!

ఇప్ప పువ్వు కేవలం సారా కోసమే అనే అపోహను వీడి.. దాని అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయుర్వేదంలో విరివిగా ఉపయోగించే ఇప్ప పువ్వు, కడుపు సమస్యలు, గుండె జబ్బులు, నోటిపూత, కీళ్ల నొప్పులు, చర్మ సమస్యలు వంటి అనేక సమస్యల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఇప్ప పువ్వులో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. అందుకే.. విప్ప పువ్వును తీసుకోవాలని సూచిస్తుంటారు ఆయుర్వేద నిపుణులు.. ఇది పోషకాలు, ఔషధ గుణాలతో నిండిన ఒక అద్భుతమైన అటవీ ఉత్పన్నం.. అందుకే.. దీనిని ఆదివాసీలు బలంగా ఉండటానికి అసలు సీక్రెట్ ఇదేనని పేర్కొంటారు. ఇప్ప పూలలో విటమిన్ బి, సి, కాల్షియం, ఐరన్, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఈ పువ్వుల సారం రక్తాన్ని శుద్ధి చేస్తుంది.. ఇంకా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వాస్తవానికి.. ఇప్ప పువ్వు అంటే చాలా మందికి కేవలం సారా తయారీకి మాత్రమే ఉపయోగిస్తారనే భ్రమ ఉంటుంది. అయితే, ఇప్ప పువ్వులో దాగి ఉన్న అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు చాలా మందికి తెలియదు. ఆయుర్వేదంలో ఔషధాల తయారీకి ఇప్ప పువ్వును విరివిగా వాడుతారు. దీనిని నేరుగా తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు.



ఇప్ప పువ్వు కడుపు సంబంధిత సమస్యలకు చక్కటి పరిష్కారం చూపుతుంది. అల్సర్, కడుపు ఉబ్బరం వంటి వాటికి ఇప్ప పువ్వు రసం తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది. అంతేకాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే ఓలిక్ యాసిడ్ గుండె జబ్బులను నివారించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ ఇప్ప పువ్వును నీటిలో మరిగించి, ఆ నీటితో పుక్కిలించడం వల్ల నోటిపూత, నోటి మంట, పంటి నొప్పి వంటి ఇబ్బందులు తగ్గుతాయి. పాలల్లో ఇప్ప పువ్వు కలుపుకొని తాగడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇప్పపువ్వు తీసుకుంటే తక్షణ శక్తి లభిస్తుంది. ఇంకా బలహీనత తగ్గి.. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇప్ప పువ్వుతో తయారు చేసిన తైలం కీళ్ల నొప్పులకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. చర్మంపై వచ్చే దద్దుర్లు, దురదను తగ్గించడంలో ఇప్ప పువ్వు రసం ప్రభావవంతంగా ఉంటుంది. నరాల బలహీనతతో బాధపడేవారు పాలలో ఇప్ప పువ్వును కలుపుకొని తాగితే ఆ సమస్య నుంచి త్వరగా బయటపడవచ్చు.

# మానసిక ఒత్తిడితో మలబద్ధకం సమస్య వస్తుందా?


నేటి కాలంలో తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని మీకు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడితో చిత్తవుతున్నారు. ఇది తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని మీకు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. నరాలు, హార్మోన్లు, పేగు మైక్రోబయోటా ఈ సంబంధాన్ని నిర్వహిస్తాయి. ఈ గట్-బ్రెయిన్ యాక్సిస్ వ్యవస్థ కారణంగా ఒత్తిడి జీర్ణవ్యవస్థను ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇది మలబద్ధకం, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలకు దారితీస్తుంది. ఐఓఅ హాస్పిటల్‌లోని మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ శెట్టి దీని గురించి మరింత సమాచారాన్ని అందించారు. ఒత్తిడి సమయంలో నాడీ వ్యవస్థ అధిక చురుకుదనం వల్ల ప్రేగు కదలికలు మందగిస్తుంది. దీని వల్ల మలబద్ధకం వస్తుంది. దీనితో పాటు ఒత్తిడి హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, పేగు పారగమ్యత పెరగడం, గట్ మైక్రోబయోటాలో మార్పులు సంభవిస్తాయి. ఇవన్నీ మలబద్ధకానికి దోహదం చేస్తాయి. ఒత్తిడి సమయంలో తినే విధానాలు కూడా మారుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.



ఎక్కువ స్వీట్లు తినడం, ఎక్కువ కెఫిన్ తీసుకోవడం, ఎక్కువ ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తినకపోవడం ఇవన్నీ జీర్ణక్రియను ప్రభావితం చేస్తాయి. ఇది ఒక విష చక్రం మాదిరి పని చేస్తుంది. ఇక్కడ ఒత్తిడి మలబద్ధకానికి కారణమవుతుంది. మలబద్ధకం ఒత్తిడిని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడం చాలా ముఖ్యం. ఇది మానసిక, శరీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తినాలి. మొలకలు తినదం, తగినంత నీళ్లు తాగడం చేయాలి. రోజువారీ వ్యాయామం,

తగినంత శారీరక శ్రమ అవసరం. మలవిసర్జన సంకేతాలను విస్మరించవద్దు. శరీరాన్ని శుభ్రంగా ఉంచడానికి ఇది అవసరమని గుర్తుంచుకోండి. మలబద్ధకం సమస్య సాధారణ పద్ధతుల ద్వారా పరిష్కరించబడకపోతే, సమస్య చాలా కాలం పాటు కొనసాగితే బరువు తగ్గడం, హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గితే, మలంలో రక్తం కనిపిస్తే, కుటుంబంలో ఎవరికైనా పెద్దప్రేగు క్యాన్సర్ చరిత్ర ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు.

## టీవీ చూస్తూ ఫోన్ స్క్రోల్ చేస్తున్నారా?



టెక్నాలజీ మనిషి జీవితాన్ని సులభతరం చేసింది, సౌకర్యవంతంగా మార్చింది. కానీ అదే సమయంలో మనిషి నడవడికలో ఊహించని మార్పులను కూడా తీసుకొచ్చింది. ఒకప్పుడు రేడియో, న్యూస్ పేపర్లతో గడిపిన కాలం నుండి ఇప్పుడు క్షణం కూడా స్మార్ట్‌ఫోన్ లేకుండా ఉండలేని స్థితికి చేరుకున్నాం. ఈ క్రమంలో మనిషి మనిషితో మాట్లాడటం మానేసి, యంత్రాలతో సంభాషిస్తున్నాడు. ముఖ్యంగా 'సెకండ్ స్క్రీన్ వీవింగ్' అనే కొత్త అలవాటు మన ఏకాగ్రతను పూర్తిగా దెబ్బతీస్తోంది. టీవీ రావడంతో రేడియో కాలం ముగిసింది. దశాబ్దాల పాటు టీవీ మన జీవితాల్లో కీలక భాగమైపోయింది. అయితే ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల రాకతో టీవీ ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇప్పుడు మనిషికి ఏ సమస్య వచ్చినా మొదట గూగుల్‌ను సంప్రదిస్తున్నాడు. అప్పటికి సమస్య తీరకపోతేనే నిపుణుల వద్దకు వెళుతున్నాడు. ఈ క్రమంలో మనిషికి మనిషికి మధ్య ఉండే సంబంధాలు కేవలం అవసరం ఉంటేనే అన్నట్లుగా మారిపోయాయి. టీవీ, సెల్ ఫోన్.. ఇవి రెండూ ఇప్పుడు మన కళ్లకు అతుక్కుపోయాయి. టీవీ చూస్తూనే పక్కన మొబైల్ స్క్రోల్ చేయడాన్ని నిపుణులు 'సెకండ్ స్క్రీన్ వీవింగ్' అని పిలుస్తున్నారు. ఇందులో మనిషి రెండింటిపై సమానంగా శ్రద్ధ పెట్టలేక ఏకాగ్రత కోల్పోతున్నాడు. టీవీ అనేది కేవలం బ్యాగ్రౌండ్ నాయిస్‌గా మారిపోయింది. సెల్ ఫోన్ లో ఎప్పుడు కావాలంటే అప్పుడు సమాచారం లభిస్తుండటంతో, టీవీ కోసం వేచి చూసే ఓపిక మనిషిలో చచ్చిపోయింది. ఒకే సమయంలో రెండు స్క్రీన్ల మీద దృష్టి పెట్టడం వల్ల మన మెదడు ఏ పనీ సరిగ్గా చేయలేకపోతోంది. దీనివల్ల ఏకాగ్రత లోపిస్తోంది. కేవలం టీవీ చూసేటప్పుడే కాదు, ఏ పని చేస్తున్నా సెల్ ఫోన్ పక్కన ఉండటం వల్ల దృష్టి మళ్లుతోంది. భవిష్యత్తులో ఇది తీవ్రమైన మానసిక సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది. టెక్నాలజీని మనం ఉపయోగించుకోవాలి కానీ, అది మనల్ని నియంత్రించకూడదు. టెక్నాలజీ ఇచ్చే సౌకర్యం బాగుంటుంది కానీ, అది మనిషిలోని సహజత్వాన్ని చంపేస్తోంది. సెల్ ఫోన్ లో మునిగిపోయి పక్కన ఉన్న వారితో మాట్లాడటం మర్చిపోతే, చివరకు ఒంటరితనం మిగులుతుంది. ఇప్పటికైనా 'స్క్రీన్ టైమ్' తగ్గించి, నిజమైన ప్రపంచంలోకి రావాల్సిన అవసరం ఉంది.

## స్మార్ట్‌ఫోన్ యుగంలో పెరుగుతున్న 'నిశ్శబ్ద హంతకి'!



ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం అంటే కుటుంబం ఒకరిని శాశ్వతంగా కోల్పోవడమే. కారణం ఏదైనా కావచ్చు.. అది ఎంత పెద్ద సమస్య అయినా కావచ్చు.. దానికి పరిష్కారం మాత్రం ఆత్మహత్య కాదు అనే విషయాన్ని తెలుసుకోవాలి. ఆత్మహత్య చేసుకునే వ్యక్తి మానసిక ఆరోగ్యం ఎంతో ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతారు. ఆధునిక సదుపాయాలు మనిషికి సౌకర్యాన్ని ఇస్తున్నాయి కానీ, మనశ్శాంతిని ఇవ్వలేకపోతున్నాయి. ఒకప్పుడు సమస్య వస్తే పది మందితో పంచుకునే వారు ఉండేవారు. కానీ ఇప్పుడు అందరూ సోషల్ మీడియాలో బిజీగా ఉంటూ, పక్కనున్న వారితో మాట్లాడటమే మరిచిపోతున్నారు. ఈ క్రమంలోనే మనిషి ఒంటరిగా మారిపోతున్నాడు. తన సమస్యను ఎవరికీ చెప్పుకోలేక, లోపల ఉన్న బాధను పది మందికి తెలిస్తే నామోషీగా భావిస్తూ డిప్రెషన్ లోకి జారుకుంటున్నాడు. ఇది ఎంతటి స్థాయికి చేరుతోందంటే.. చివరకు ప్రాణాలు తీసుకోవడమే పరిష్కారం అని నమ్మేలా చేస్తోంది.

చాలామంది డిప్రెషన్ ను కేవలం ఒక మూడ్ ఆఫ్ అని లేదా కొద్దిసేపు ఉండే బాధ అని అనుకుంటారు. కానీ మానసిక వైద్య నిపుణుల ప్రకారం ఇది చాలా తీవ్రమైన జబ్బు. ఇది మెదడులోని రసాయనాల అసమతుల్యత వల్ల కలుగుతుంది. మనిషిలో ఉత్సాహం, శక్తి, కాంతి ఒక్కొటిగా తగ్గిపోతూ వస్తాయి. ఏ విషయంలోనూ ఆసక్తి ఉండదు. ఎప్పుడూ విచారంగా ఉండటం, భవిష్యత్తుపై ఆశ కోల్పోవడం దీని ప్రధాన లక్షణాలు. డిప్రెషన్ లో ఉన్న వ్యక్తి సాధారణ వ్యక్తుల్లా ఉండలేడు. వారు అందరిలో ఉన్నా ఒంటరిగానే కనిపిస్తారు. వారి బాడీ లాంగ్వేజ్ లో చాలా మార్పు వస్తుంది. లైంగిక వేధింపులు, ఆర్థిక సమస్యలు, ప్రియమైన వారిని కోల్పోవడం లేదా దీర్ఘకాలిక అనారోగ్యం వంటివి డిప్రెషన్ కు దారి తీస్తాయి. వీరు తరచూ చిరాకు పడుతూ, తాము ఈ లోకానికి విలువ లేని వారమని భావిస్తూ ఉంటారు. ఈ దేశంలో జరిగే ఆత్మహత్యలలో 60 నుంచి 65 శాతం కేవలం డిప్రెషన్ వల్లనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ స్థితిలో ఉన్న వారు పదే పదే మరణం గురించే ఆలోచిస్తూ ఉంటారు. ఈ జన్మను ఇక్కడితో ఆపేస్తే మరో కొత్త జన్మలో అన్నీ బాగుంటాయని గట్టిగా నమ్ముతారు. చావు మాత్రమే తమ బాధలకు శాశ్వత పరిష్కారం అని భావించి అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్నారు.

## మటన్ రుచికరమే కాదు, ఆరోగ్యానికి దివ్య ఔషధం!

పోషకాహార నిపుణుల ప్రకారం, మటన్ కేవలం రుచికరమైన ఆహారమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మేక కాళ్ళ సూప్ (పాయా) కొల్లాజెన్, ప్రోటీన్లు, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం వంటి ఖనిజాలు, విటమిన్లతో సమృద్ధిగా ఉంటుందని సూచిస్తున్నారు. ఇది ఎముకల బలానికి, కీళ్ల నొప్పుల నివారణకు దోహదపడుతుందని పేర్కొంటున్నారు. ఇక అలాగే రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుందట.

పాయా కీళ్ల నొప్పులను తగ్గించి, ఎముకలను బలోపేతం చేయడంతోపాటు.. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.. అనారోగ్యం తర్వాత త్వరగా కోలుకోవడానికి సహాయపడతాయి. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బలహీనపడిన ఇమ్యూనిటీకి మేక కాళ్ళ సూప్ చాలా మంచిది. ఇది శరీర రక్షణ వ్యవస్థను సహజంగా బలోపేతం చేయడానికి అద్భుతమైన మార్గం. ఈ సూప్ శరీరానికి మంచి వెచ్చదనాన్ని అందించి, అంటువ్యాధులు, ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. అందుకే చాలామంది దీన్ని ఒక అద్భుతమైన ఇంటి చిట్కాగా వాడతారు. ఎంతకీ తగ్గని దీర్ఘకాలిక జలుబు లేదా ఎముకల నొప్పులతో సతమతమవుతున్నారా? దీనికి మన పెద్దలు తరతరాలుగా సూచించిన నల్లి సూప్ ఒక మ్యాజిక్ లా పనిచేస్తుంది. ఇది కేవలం జలుబును తగ్గించడమే కాదు.. ఫ్రాక్చర్ అయిన ఎముకలు త్వరగా అతుక్కునేలా సహాయపడుతుంది. అంతేకాకుండా, రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచి, ఎముకలకు అదనపు బలాన్ని ఇస్తుంది.

# ఇది డూ ఆర్ డై మ్యాచ్.. అభిషేక్‌ను జట్టు నుంచి తీసేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా డేరింగ్ అండ్ డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ తీవ్రంగా తడబడుతున్నాడు. ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచుల్లో డకౌటై తీవ్రంగా నిరాశపర్చాడు. దీంతో అభిషేక్ శర్మను జట్టు నుంచి తప్పియాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ అభిషేక్ శర్మపై కీలక వ్యాఖ్యలు చేశాడు. ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నా అభిషేక్ శర్మను 2026, ఫిబ్రవరి 26న జింబాబ్వేతో జరగనున్న కీలక పోరు నుంచి తప్పించాలని సూచించాడు. భారత్‌కు డూ ఆర్ డైగా మారిన ఈ మ్యాచులో అభిషేక్ స్థానంలో సంజు శాంసన్‌ను ప్లేయింగ్ లెవన్‌లోకి తీసుకోవాలన్నాడు. ఇండియాకు ఈ మ్యాచ్ ఎంతో కీలకమని.. ఒకవేళ ఓడిపోతే మెగా టోర్నీలో ఇండియా టైటిల్ వేట ముగుస్తుందన్నాడు. ఆటగాళ్ల ఫామ్ ఆధారంగా బీసీసీఐ తమ అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోవాలని సూచించారు. అనారోగ్యం, ఫామ్ లేమితో బాధపడుతోన్న యువ ఓపెనర్‌కు కొన్ని రోజులు విశ్రాంతి ఇవ్వాలని చెప్పాడు. అభిషేక్ తో పాటు తిలక్ వర్మ ఫామ్ కూడా ఆందోళన కలిగిస్తుందన్నారు. తిలక్ అంచనాల మేర రాణించడంలో విఫలం అవుతున్నాడని పేర్కొన్నారు.

నాకౌట్ రౌండ్‌కు ముందే టీ20 వరల్డ్ కప్ ఉత్కంఠ భరితమైన దశకు చేరుకుంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన టీమిండియా ఒకే ఒక్క ఓటమితో టోర్నీలో చావోరేవో తేల్చుకునే పరిస్థితిలో నిలిచింది. సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలుపుకోవాలంటే తప్పక నెగ్గాల్సిన సూపర్–8 రౌండ్ మ్యాచ్‌లో గురువారం ఇక్కడి చెపాక్ స్టేడియంలో జరిగే సంచలనాల జట్టు జింబాబ్వేతో అమీతుమీ తేల్చుకోనుంది.సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఘోర పరాజయం తర్వాత ఇండియా నెట్ రన్ రేట్ ( 3.80) దారుణంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ సేనకు జింబాబ్వేపై గెలుపు మాత్రమే సరిపోదు. సెమీస్ రేసులో ముందంజ వేయాలంటే భారీ ఆధిక్యంతో విజయం సాధించాల్సి ఉంటుంది.

# సౌతాఫ్రికా ఫటాఫట్.. ధనాధన్ విక్టరీ.. భారీ తేడాతో విండీస్ ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా, విండీస్ మధ్య జరిగిన మ్యాచ్ ధనాధన్.. ఫటాఫట్ లా జరిగింది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా జట్టు.. ఆడుతూ పాడుతూ విజయం సాధించింది. ఫటాఫట్.. ధనాధన్ అన్నట్లు.. 16.1 ఓవర్లలోనే టార్గెట్ రీచ్ అయ్యింది. విండీస్ విసిరిన 177 పరుగులు లక్ష్యాన్ని.. జస్ట్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి.. 9 వికెట్ల తేడాతో సౌతాఫ్రికా జట్టు విజయం సాధించింది. కాగా అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో వెస్టిండీస్ తో జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచి బౌలింగ్ తీసుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన కరేబియన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. విండీస్ బ్యాటర్లలో రొమారియో షెపర్డ్ (52), జేసన్ హోల్డర్ (49)ల అద్భుతమైన బ్యాటింగ్ చేయగా, బ్రాండన్ కింగ్ (21), షాయ్ హోప్ (16 ) ఫర్వాలేదనిపించారు. అనంతరం 177 పరుగులు లక్ష్య ఛేదనకు దిగిన సౌతాఫ్రికా జట్టు ఆది నుంచే దూకుడుగా బ్యాటింగ్ చేసింది. ప్రోటీస్ జట్టు ఓపెనర్లు క్వింటన్ డి కాక్, ఐడెన్ మార్క్రామ్ లు మధ్య 95 పరుగుల భాగస్వామ్యాన్ని రోస్టన్ చేజ్ విడగొట్టాడు. డి కాక్ కి వేసిన బాల్ ని షాట్ ఆడగా, లాంగ్-ఆన్ లో జాసన్ హోల్డర్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో 95 పరుగుల వద్ద సఫరీ జట్టు తొలి వికెట్ ను కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ బాధ్యతలు చేపట్టిన కెప్టెన్ మార్క్రామ్ 45 బంతుల్లోనే 6 ఫోర్లు, 4 సిక్సులతో 82 పరుగులతో నాటౌట్ గా నిలవగా, మరో ఎండ్ లో ర్యాన్ రికెల్టన్ సైతం 28 బంతుల్లోనే 4 ఫోర్లు, 2 సిక్సులతో 45 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచి టీమ్ ని గెలిపించారు.

# ప్రభుత్వమే మమ్మల్ని కాపాడాలి: శ్రీలంక కెప్టెన్ షనక

**టీ20 వరల్డ్ కప్ నుంచి నిష్క్రమణపై శ్రీలంక కెప్టెన్ షనక ఆవేదన**

**బయటి నుంచి వస్తున్న నెగెటివ్ వాతావరణమే ఓటమికి కారణమన్న షనక**

**విమర్శల నుంచి ఆటగాళ్లను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**సూపర్ 8 దశలో పేలవ ప్రదర్శనకు దేశ ప్రజలకు క్షమాపణలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ లో సూపర్ 8 దశ నుంచే నిష్క్రమించడంపై శ్రీలంక కెప్టెన్ దసున్ షనక తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. తమ జట్టు ఓటమికి కేవలం ఫిట్‌నెస్, ఫామ్ మాత్రమే కారణం కాదని, బయట నుంచి సృష్టించిన ప్రతికూల వాతావరణం కూడా జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపిందని సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్లను అనవసర విమర్శల నుంచి కాపాడేందుకు ప్రభుత్వమే జోక్యం చేసుకోవాలని అతడు కోరడం చర్చనీయాంశంగా మారింది.

న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 61 పరుగుల తేడాతో ఓటమి అనంతరం షనక మీడియాతో మాట్లాడాడు. “ఆటగాళ్లుగా తాము ఎంత సానుకూలంగా ఉన్నప్పటికీ, బయటి నుంచి వచ్చే నెగెటివ్ వార్తలను నియంత్రించడం చాలా కష్టం. ఈ ప్రతికూల వాతావరణం శ్రీలంక క్రికెట్‌కు మంచిది కాదు. మేం ప్రపంచకప్ ఓడిపోయామని తెలుసు, దానికి కారణాలూ ఉన్నాయి. కానీ ఈ నెగెటివిటీ ఎందుకు వ్యాప్తి చేస్తున్నారు?” అని ప్రశ్నించాడు. భవిష్యత్తులో వచ్చే ఆటగాళ్ల మానసిక ఆరోగ్యం కోసమైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ తరహా విమర్శలను ఆపితే, అది క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుందని షనక అభిప్రాయపడ్డాడు.అంతకుముందు సూపర్ 8 దశలో ఇంగ్లండ్, న్యూజిలాండ్‌పై పేలవ ప్రదర్శన కనబరచినందుకు దేశ ప్రజలకు షనక క్షమాపణలు చెప్పాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్ గెలవాల్సిందని, కానీ సమయస్ఫూర్తితో ఆడలేకపోయామని అన్నాడు. అభిమానులకు సంతోషాన్నిచ్చే ఒక్క విజయాన్ని కూడా అందించలేకపోయామని విచారం వ్యక్తం చేశాడు. తాము ఊహించినట్లుగా ఇక్కడి పిచ్‌లు కూడా సహకరించలేదని పేర్కొన్నాడు.జట్టు ఫిట్‌నెస్ అత్యున్నత స్థాయిలో లేదని షనక బహిరంగంగా అంగీకరించాడు. “ఈ టోర్నీ ముగిసే సరికి మా జట్టులో నలుగురైదుగురు కీలక ఆటగాళ్లు గాయపడ్డారు. స్టార్ బౌలర్ మతీశ పతిరణ, ఆల్‌రౌండర్ వనిందు హసరంగ వంటి ముఖ్యమైన ఆటగాళ్లను కోల్పోవడం జట్టును దెబ్బతీసింది. ఫిట్‌నెస్ విషయంలో ఇతర జట్లు తమ కంటే ఎంతో ముందున్నాయి” అని స్పష్టం చేశాడు.


ఇక, కెప్టెన్‌గా తన భవిష్యత్తుపై స్పందిస్తూ.. ఎంతకాలం కెప్టెన్‌గా ఉంటానో తనకు తెలియదని, ఆ నిర్ణయం సెలక్టర్లు, శ్రీలంక క్రికెట్ బోర్డు పరిధిలో ఉంటుందని చెప్పాడు. కెప్టెన్‌గా ప్రపంచకప్‌లో ఆడే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని, ఈ ప్రయాణంలో కొన్ని మంచి నిర్ణయాలతో పాటు కొన్ని తప్పులు కూడా చేశానని షనక పేర్కొన్నాడు.



మృణాల్ ఠాకూర్: ప్రతి చిరునవ్వులో టైమ్‌లెస్ గ్రేస్

# హిస్టరీ రిపీట్ చేయడానికి సిద్ధమవుతున్న సౌత్ యూనివర్స్

సౌత్ ఇండియన్ సినిమా పాన్ ఇండియా మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటడం మొదలుపెట్టింది బాహుబలి సినిమాతోనే. ఆ సినిమా తర్వాత ఫ్రాంచైజ్‌లపై దృష్టి మరింత పెరిగింది. ఇప్పుడు అదే ట్రాక్‌పై భారీ అంచనాలతో ముందుకు రాబోతున్న రెండు ప్రాజెక్టులు పుష్ప3 మరియు కెజిఎఫ్3.





**పాన్ ఇండియా ఫ్రాంచైజ్ రేస్**

రాకీ భాయ్ ఎలివేషన్స్‌తో ఖ+ఫీ సిరీస్ కు దేశవ్యాప్తంగా మాస్ ఇమేజ్ విపరీతంగా వచ్చింది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చి నార్త్ బెల్ట్‌లోనూ భారీ మార్కెట్‌ను సొంతం చేసుకోవడం ఈ ఫ్రాంచైజ్ ప్రత్యేకత. మరోవైపు పుష్ప క్యారెక్టర్ స్టైల్, యాటిట్యూడ్, డైలాగ్స్‌తో నార్త్‌లో సెన్సేషన్ సృష్టించింది. ఈ రెండు సిరీస్‌లూ కేవలం సీక్వెల్స్‌లా మాత్రమే కాకుండా, బ్రాండ్‌లుగా ఎదిగాయి. మెర్చండైజ్, సోషల్ మీడియా ట్రెండ్స్, ఫ్యాన్ బేస్.. ఇవన్నీ కలిపి వీటిని పాన్ ఇండియా రేంజ్‌లో నిలబెట్టాయి. బాహుబలి ఫ్రాంచైజ్ తర్వాత సౌత్ నుంచి వచ్చి అంతటి హైప్, క్రేజ్ అందుకున్న ప్రాజెక్టులు ఇవే.

**బాక్సాఫీస్ ప్రెడిక్షన్**

ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్న అంచనాల ప్రకారం ఈ రెండు సినిమాలూ రిలీజ్ తర్వాత సౌత్ ఇండియన్ సినిమాల్లో అత్యంత సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజ్‌లుగా నిలవడం ఖాయమని భావిస్తున్నారు. యష్, రాకీ భాయ్‌గా స్క్రీన్‌పై కనిపించే ప్రతిసారీ థియేటర్లు షేకవుతాయనే విశ్వాసం అభిమానుల్లో ఉంది. మరోవైపు అల్లు అర్జున్ మాస్ ట్రాన్స్‌ఫర్మేషన్, యాక్షన్ స్టైల్ పుష్ప బ్రాండ్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. ఈ రెండు సినిమాలకు ఓపెనింగ్స్ విషయంలో అడ్వాన్స్ బుకింగ్స్ కీలకం కానున్నాయి. హిందీ మార్కెట్, ఓవర్సీస్ కలెక్షన్లు, పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్.. ఇవన్నీ రికార్డులను బద్దలు కొట్టే అవకాశాలను పెంచుతున్నాయి. హైప్ పరంగా చూసుకుంటే హిస్టరీ రిపీటయ్యే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**నెక్స్ట్ జనరేషన్ యూనివర్స్ ట్రెండ్**

ఈ ఫ్రాంచైజ్‌ల సక్సెస్ తో ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో సినిమాటిక్ యూనివర్స్ మోడల్‌పై చర్చలు మొదలయ్యాయి. కెజిఎఫ్ ప్రపంచాన్ని విస్తరించే ప్రయత్నాల్లో భాగంగా టాక్సిక్ లాంటి ప్రాజెక్టులపై ఆసక్తి పెరుగుతోంది. క్యారెక్టర్ల మధ్య కనెక్షన్స్, స్పిన్-ఆఫ్స్, క్రాస్ ఓవర్స్ లాంటి అంశాలు ఫ్యూచర్ లో సాధ్యమవుతాయనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. పుష్ప సిరీస్ కూడా ఈ భాగంతో ముగుస్తుందా? లేక కొత్త క్యారెక్టర్లతో విస్తరించి యూనివర్స్‌గా మారుతుందా? అన్నది ప్రశ్నగా మారింది. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని కథా విస్తరణ, పాత్రల డెప్త్, వరుస సీక్వెల్స్ లాంటి వ్యూహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, పాన్ ఇండియా ఫ్రాంచైజ్ రేస్, భారీ బాక్సాఫీస్ అంచనాలు, యూనివర్స్ కాన్సెప్ట్ అన్నీ కలిపి ఈ సినిమాలపై ఉన్న ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. మరి రిలీజ్ తర్వాత ఈ ఫ్రాంచైజ్ సినిమాలు ఎలాంటి సంచలనాలను సృష్టిస్తాయో చూడాలి.



ఫుల్‌సైడ్ గ్లామర్‌తో అభిమానులను స్టన్ చేస్తుంది ఆకాంక్ష పూరి

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965